నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
చర్చ తెలంగాణ దిన పత్రిక
ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అక్షర రూపం దాల్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో బ్యూరో, జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 23 సంచిక : 05
శుక్రవారం, సెప్టెంబర్ 26, 2025 , పేజీలు - 12 వెల: 2/-

# బీ అలెర్ట్

## తెలంగాణలో భారీ వర్షాలు..

**కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు**



- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్న ముఖ్యమంత్రి
- అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించాలని సూచన
- విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు సూచన




రానున్న రెండు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆయన కీలక సూచనలు జారీ చేశారు. కలెక్టర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

# రాజ్‌భవన్‌కు చేరిన ఫైల్

## ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు..




- కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరిన ప్రభుత్వం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి రాజ్‌భవన్‌కు చేరిన దస్త్రం
- ఫైల్‌పై న్యాయనిపుణుల అభిప్రాయం కోరుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కేటీఆర్ ఆదేశాలతోనే రూ. 54.88 కోట్ల నష్టం జరిగిందన్న ఏసీబీ నివేదిక
- విజిలెన్స్ కమిషనర్ కూడా ప్రాసిక్యూషన్‌కు గ్రీన్ సిగ్నల్
- ఐఏఎస్ అరవింద్ కుమార్‌పై చర్యలకు కేంద్ర అనుమతి కోసం లేఖ

# స్థానిక ఎన్నికలపై బిఆర్ఎస్ అప్రమత్తం

**నేతలను అలర్ట్ చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**ముఖ్యనేతలతో కెటిఆర్, హరీష్ రావుల టెలి కాన్ఫరెన్స్**



**హైదరాబాద్,సెప్టెంబర్25:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో బిఆర్ఎస్ అప్రమత్తం అయ్యింది. పార్టీ శ్రేణులను,కార్యకర్తలను అలర్ట్ చేసింది. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు- చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. **మిగతాది 2లో...**

# సచివాలయంలో ఘనంగా బతుకమ్మ

## వేడుకలకు హాజరైన మంత్రులు సీతక్క, సురేఖ



**హైదరాబాద్,సెప్టెంబర్25 :** డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. **మిగతాది 2లో...**

# మద్యం దుకాణాల కేటాయింపు షెడ్యూల్ ఖరారు




# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

- రూ.30 వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం
- రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు




**న్యూఢిల్లీ,సెప్టెంబర్25:** దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులు అనుసంధానం **మిగతాది 2లో...**

# స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు.

**జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో తన పేరు చేర్చడంపై స్మిత అభ్యంతరం**

**కమిషన్ నివేదికను కొట్టివేయాలంటూ న్యాయస్థానంలో పిటిషన్**

**ఈ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దన్న కోర్టు**




# గ్రూప్-1 విజేతలకు 27న నియామకపత్రాలు

సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందచేత సిఎస్ రామకృష్ణారావు వెల్లడి




# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

**వాటాల తేడాలు రావడంతోనే కేసీఆర్ కుటుంబంలో కల్లోలం**

**ఆ పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు : మహేశ్‌కుమార్‌గౌడ్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్25 :** బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఆశాభావం వ్యక్తంచేశారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను వంతులవారీగా పంచుకున్నారని.. ఇప్పుడు వాటాల దగ్గర తేడా రావడంతో కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. **మిగతాది 2లో...**

# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయని, జాతీయ రహదారుల నిర్వహణ వల్ల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించానని, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టులకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.. మెట్రో విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు.. చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతారు.. మెట్రో విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసినపుడు.. వారు చాలా స్పష్టంగా చెప్పారు.. ఇప్పుడు మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి కొత్తగా నిర్మాణం చేపట్టనున్న కంపెనీ మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు.. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది.. ఇది రాష్ట్ర ప్రభుత్వంలోని అంశం. అది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. దీన్ని వారే తేల్చుకోవాలి.. మెట్రో అంశానికి అన్నిరకాలుగా మా సహకారం ఉంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం పై సీబీఐ ప్రతిపాదనలు అందాయని పరిశీలనలో ఉందని తెలిపారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుంది... రెండు పార్టీలు అర్థం పర్థం లేకుండా, ఆధారాల్లేకుండా.. మాట్లాడుతున్నారు. మీరు మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. మేం ఇండిపెండెంట్ గా ముందుకెళ్తాం.. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా.. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా పనిచేస్తున్నాం.. బీసీ రిజర్వేషన్ పెరగాలని అసెంబ్లీలో మద్దతిచ్చాం.. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా.. 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల నేతలు విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. వాళ్లకు బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. చిల్లర మాటలు, అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. బిజెపికి తెలంగాణలో ఎవరితో కలవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, కేటీఆర్, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బిజెపి ఎప్పుడు కలవదని స్పష్టం చేశారు. కలిసి కాపురాలు చేసింది మీరు.. ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంది మీరు.. మంత్రి పదవులు పంచుకుంది మీరు.. బిజెపికి ఎటువంటి అవసరం లేదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్వతంత్రంగా పోటీ- చేస్తాం.. టిఆర్ఎస్, కాంగ్రెస్లకు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చేందుకే మా ప్రయత్నం చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి వ్యవహారశైలి సమంజసంగా లేదు. జెన్ జీ విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలు.. నేపాల్ లో జరిగినట్లుగా.. పీఎం ఇంటిపైనా, మంత్రుల ఇంటిపైనా.. న్యాయస్థానాలపైనా దాడులు జరిగినట్లుగా.. ఇక్కడ జరగాలని కేటీఆర్ భావిస్తున్నారా? బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇక్కడ అమలవుతోంది.. దేశంలో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే.. మనం వేగంగా పురోగతి సాధిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో.. కొందరు దివాళాకోరు మాటలు మాట్లాడం సరికాదు. ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మద్యం దుకాణాల కేటాయింపు షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇక అక్టోబర్ 23వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు అంటే రెండేళ్ల కాలానికి అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలుగా నిర్ధారించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. ఇక మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేశారు అధికారులు.

# స్థానిక ఎన్నికలపై బిఆర్ఎస్ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు- చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు- చేసేలా చూడాలని సూచించారు.



# సచివాలయంలో ఘనంగా బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సంఘం సభ్యులు శైలజ, మంగ, చంద్రకళ పాల్గొన్నారు.

# స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ కు హైకోర్టు ఊరటనిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం విదితమే. ఈ నివేదికలో ఐఏఎస్ స్మితా సబర్వాల్ పేరును కూడా కమిషన్ పేర్కొంది. దీనిపై స్మితా సబర్వాల్ హైకోర్టును ఆశ్రయించారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని ఆమె న్యాయస్థానంలో సవాల్ చేశారు. కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఇప్పటికే దాఖలైన పిటిషన్లతో కలిపి దీనిని విచారిస్తామని పేర్కొంది.

# గ్రూప్-1 విజేతలకు 27న నియామకపత్రాలు

## సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందచేత

## సిఎస్ రామకృష్ణారావు వెల్లడి

**హైదరాబాద్,సెప్టెంబర్25:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ -1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నత అధికారులతో సి.ఎస్. టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ద్వారా ఎంపి-కై-న 563 మంది అభ్యర్థులకు అపాయిం-టె-÷-మంట్ ఆర్డర్లు అందిస్తారని సిఎస్ తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు- సి.ఎస్ తెలిపారు. ఎంపి-కై-న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఏడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు- పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి హార్థిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు- చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ఈ -టె-లి కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీ-కే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. గురువారం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహ పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు ఆగిపోయింది. తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తోంది. పీసీసీ పాదయాత్ర సీఎం రేవంత్ రెడ్డికి, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కి తెలియకుండా చేశారని కొందరు గతంలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది. బీఆర్ఎస్ మళ్లీ పునర్జీవం పోసుకోదు. ఏం చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి బీజేపీ నాయకులకు ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపొచ్చు ’ అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అన్నిటిపైన సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కవితది ఆస్తుల పంచాయితీ. కాంగ్రెస్‌తో కవితకు ఏలాంటి సంబంధం లేదు. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది ?. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్‌లు రికార్డు చేశారు. నాది, రేవంత్‌రెడ్డిది రెండున్నరేళ్ల నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసింది. నేను వాడిన జియో సిమ్ కార్డు నెంబర్ జియోసంస్థకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ వ్యూహ రచన చేసి గత ఎన్నికల్లో గెలిచారు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. క్లియర్ ఆధారాలు ఉన్నాయి’ అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# రాజ్‌భవన్‌కు చేరిన ఫైల్

## ఫార్ములా ఈ-రేసు కేసులో

## కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు..

రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఫార్ములా ఈ-రేసు కేసు వ్యవహారం కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సంబంధిత దస్త్రం రాజ్‌భవన్‌కు చేరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఫైల్‌ను అందుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, దీని పై న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తు న్నట్లు సమాచారం. వారి సూచనల అనంతరం గవర్నర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అంతకుముందు, ఈ కేసుపై లోతైన దర్యాప్తు చేపట్టిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఏసీబీ నివేదికను పరిశీలించిన విజిలెన్స్ కమిషనర్ కూడా ఇందుకు పచ్చజెండా ఊపారు. ఈ సిఫార్సుల ఆధారంగానే ప్రభుత్వం ఇప్పుడు గవర్నర్ అనుమతి కోసం ఫైల్‌ను ముందుకు పంపింది.




**ఏసీబీ నివేదికలో కీలక ఆరోపణలు**

ఫార్ములా ఈ-రేసు ఒప్పందం నుంచి నిధుల చెల్లింపుల వరకు అనేక నిబంధనలను ఉల్లంఘించారని ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రెండు విడతల్లో విదేశీ కరెన్సీ రూపంలో డబ్బు చెల్లించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 54.88 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. అప్పటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ మొత్తం జరిగిందని చెప్పడానికి తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఏసీబీ తెలిపినట్లు సమాచారం. ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థ, ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ ఎండీలను ఏసీబీ నిందితులుగా చేర్చింది. ఐఏఎస్ అధికారి అయిన అరవింద్ కుమార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దీంతో, ఆయనపై ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వాలని కోరుతూ కేంద్ర సిబ్బంది, వ్యవహారాల శాఖకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో లేఖ రాయనున్నట్లు తెలిసింది.

# జీ అలెర్ట్

**హైదరాబాద్,సెప్టెంబర్25:** తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు- ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు-, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు-, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం మొదలైంది. గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, ప్యాటీ-÷-న, పారడైజ్, సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్, చాదర్ ఘట్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. గత వారం రోజులుగా అకాశమంతా మబ్బులుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తోంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చిరికలు జారీ చేసింది.

## సెప్టెంబర్ 27, 28 తేదీలలో జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్ జయంతి ఉత్సవాలు %-% ఏఐఎస్ఎఫ్



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా, సెప్టెంబర్ 27, 28 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్, కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు.వారు మాట్లాడుతూ అందరికీ విద్య, ఉపాధి కోసం ఉద్యమిద్దాం.
మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం.భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతలో స్ఫూర్తి నింపాలి.ఆయన త్యాగాలు పాఠ్యపుస్తకాలలో చోటు చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. భగత్ సింగ్ జయంతిని అధికారిక దినోత్సవంగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి.వారు భగత్ సింగ్ జీవిత చరిత్రను గ్రామాలు, పల్లెల్లో ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపెల్లి పవన్, సాయి వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్ తదితరులు.

# భద్రాద్రి కొత్తగూడెంలో మద్యం షాపుల లాటరీ డ్రా



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** నూతన మద్యం విధానం 2025%-%2027 లో భాగంగా జిల్లా పరిధిలోని 88 ఏ4 మద్యం షాపులకు కేటాయింపులు చేపట్టారు.44 షాపులు ఏజెన్సీ ఎస్టీలకు కేటాయించగా, మిగతా 44 షాపులు కుల ప్రాతిపదికన కేటాయించబడ్డాయి.ఎస్సీలకు %-% 7 షాపులు,గౌడ్‌లకు %-% 6 షాపులు,ఓపెన్ ఫర్ ఆల్ %-% 31 షాపులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, తెలంగాణ, హైదరాబాద్ ఆదేశాల మేరకు, గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో లాటరీ డ్రా నిర్వహించారు.

## 26వ తేదీన కొత్తగూడెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద భారీ ధర్నా - జేఏసీ పిలుపు



**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:**
సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘాల జేఏసీ నేతలు ప్రభుత్వం, యాజమాన్యం మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. కేవలం రూ.500 పెంపుతో చేతులు దులుపుకోవడం కాంట్రాక్టు కార్మికులపై ఘోర అన్యాయమని వారు విమర్శించారు.6395 కోట్ల రూపాయల లాభాలను సింగరేణి యాజమాన్యం సాధించిందని, కానీ ఆ లాభాల్లో 36 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు సరైన వాటా ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. బోనస్ చట్టం ప్రకారం 20 శాతం వరకు బోనస్ ఇవ్వాల్సిన హక్కు ఉన్నప్పటికీ, ఒక్కో కార్మికునికి కనీసం రూ.20,000 రావలసి ఉందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి హామీలు, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల మాటలు అన్నీ గాలికొదిలిన వాగ్దానాలేనని, ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా, వేతనాల పెంపు కల్పించాలని డిమాండ్ చేశారు.జేఏసీ నేతలు మల్లెల రామనాథం, భూక్య రమేష్, గుడెల్లి యకయ్య, గూగులోత్ సక్రాం, మాతంగి రాజేష్, భాస్కర్, రాణి, రవి, తాండ్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు. జేఏసీ పిలుపు మేరకు (26న) కొత్తగూడెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు, కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్











**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** స్వచ్ఛత అనేది ఒక్కరోజు జరిపే కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి నిరంతర బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పరిశుభ్రత అలవాటు సమాజంలో నిత్యకృత్యంగా కొనసాగితేనే ఆరోగ్యవంతమైన, పచ్చదనం కలిగిన వాతావరణం ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు.భారత ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పరిశుభ్రతా కార్యక్రమంలో గడ్డి, పిచ్చిమొక్కలను తొలగిస్తూ అందరూ శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రతి ఇంటి వద్ద చెత్తను వేర్వేరు డబ్బాలలో వేసి సక్రమంగా పారవేయాలి.ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయరాదు.మురుగులో చెత్త వేయడం వల్ల దోమల పెరుగుదల, వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.ఆరోగ్యకరమైన జీవనం కోసం పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరి అని ఆయన హితవు పలికారు. యువత, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చివరగా పాల్గొన్నవారు అందరూ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఏడి మైన్స్ దినేష్, గ్రౌండ్ వాటర్ ఏడి రమేష్, మెప్మా పీడీ రాజేష్, జిల్లా ఉద్యోగులు, కళాశాల సిబ్బంది.

# అశ్వారావుపేట సీఐ కార్యాలయం సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**గ్రేవ్ కేసుల్లో నిందితులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి**






**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారుఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.కోడిపందాలు, పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అంతర్రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి దొంగతనాలను అరికట్టాలి.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.“నేను సైతం” కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం చూపాలి.గ్రేవ్ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా బాధ్యతతో పనిచేయాలిఅలాగే, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సైలు యాయాతి రాజు, అఖిల, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన సిపిఐ 25వ జాతీయ మహాసభలు

**జాతీయ కార్యవర్గ సభ్యులుగా మరోసారి కూనంనేని ఎన్నిక**
**జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సాబీర్ పాషా తొలిసారి ఎంపిక**
**హర్షం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు**





**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం :**
ఐదు రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్ లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ మహాసభకు భద్రాద్రి జిల్లా నుంచి తొమ్మిదిమంది ప్రతినిధులుగా పాల్గొన్నారు. గురువారం జరిగిన జాతీయ సమితి ఎన్నికల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే, కొత్తగూడెంకు చెందిన కూనంనేని సాంబశివరావు జాతీయ కార్యవర్గ సభ్యులుగా తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకి తొలిసారిగా జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కూనంనేని ఐదు దశాబ్దాలుగా సీపీఐలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2005 నుంచి 2009 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిశారు. తిరిగి 2023లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎన్నికై ప్రస్తుతం ఎమ్మెల్యేగా, రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని కొనసాగుతున్నారు. జాతీయ సమితి సభ్యులుగా తొలిసారిగా ఎన్నికైన సాబీర్ పాషా విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించి యువజన నాయకునిగా, కార్మిక ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించారు. 1995లో ఏఐఎస్ఎఫ్ కొత్తగూడెం కార్యదర్శిగా పనిచేస్తూ సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు. ఏడు సవత్సరాలపాటు విద్యార్థి విభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2001లో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఏపి రాష్ట్రకార్యదర్శిగా బాధ్యలు చేపట్టారు. పార్టీ అవసరాల నిమిత్తం 2002 కొత్తగూడెం పట్టణ సిపిఐ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2005 నుండి 2010 వరకు కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన 2009-2017 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శిగా పనిచేసిన ఆయన జిల్లా ఏర్పడిన నాటి నుంచి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయన జాతీయ సమితిసభ్యులుగా ఎంపికకావడం పట్ల పలువురు హర్యంవ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ చిన్ననాటి నుండి వామపక్ష భావాజాలంతో పెరిగిన తనను పార్టీ గుర్తించిందని, తనపై పెట్టిన పెద్ద బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పురోభివృద్ధి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## ఐడిఓసి లో అట్ల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా







**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:**
దసరా వేడుకలలో భాగంగా ఐదవ రోజైన అట్ల బతుకమ్మ ఉత్సవాలను గురువారం ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కార్యాలయం ఆవరణ బతుకమ్మ పాటలతో పండుగ వాతావరణాన్ని సంతరించు కుంది.మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మలను అలంకరించి, భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేశారు. అట్ల బతుకమ్మ ప్రత్యేకతగా పిండివంటలు, అట్లతో తయారుచేసిన బతుకమ్మ అందరినీ ఆకట్టుకుంది.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక. ఈ పూల పండుగను తరతరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిదే అని అన్నారు. ఇలాంటి పండుగలు మహిళల ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.
స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి విద్యా చందన, తహసీల్దార్లు గన్యా, భగవాన్ రెడ్డి, స్వర్ణలత, స్వాతి బిందు, ఐడిఓసి అధికారులు, ఉద్యోగులు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాలు.

# జూబ్లీహిల్స్ ఎన్నిక సర్వే చేస్తున్నాం టికెట్ అలా నిర్ణయిస్తాం

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు.(గురువారం) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్.జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహ పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు.గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. (గురువారం) మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు.



అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు.'హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు ఆగిపోయింది. తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తోంది. పీసీసీ పాదయాత్ర సీఎం రేవంత్ రెడ్డికి, ఇన్‌చార్జ్ మీనాక్షి నటారాజన్‌కి తెలియకుండా చేశారని కొందరు గతంలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది. బీఆర్ఎస్ మళ్లీ పునర్జీవం పోసుకోదు. ఏం చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి బీజేపీ నాయకులకు ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపొచ్చు ' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.కవితది ఆస్తుల పంచాయతీ.'గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అన్నిటిపైన సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కవితది ఆస్తుల పంచాయితీ. కాంగ్రెస్‌తో కవితకు ఏలాంటి సంబంధం లేదు. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది ?. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్‌లు రికార్డు చేశారు. నాది, రేవంత్‌రెడ్డిది రెండున్నరేళ్ల నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసింది. నేను వాడిన జియో సిమ్ కార్డు నెంబర్ జియోసంస్థకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ వ్యూహ రచన చేసి గత ఎన్నికల్లో గెలిచారు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. క్లియర్ ఆధారా లు ఉన్నాయి' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాజగో పాల్ రెడ్డిపై హై కమాండ్ నిర్ణయం.'రాజగోపాల్ రెడ్డి అంశంలో హై కమాండ్ సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుంది. రేవంత్ రెడ్డి, రెడ్డి సామాజికవర్గం అయినప్పటికీ బీసీల కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారు. రేవంత్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా, సీఎంగా చూశాను వారిలో మార్పు ఏమీ లేదు. రేవంత్ రెడ్డి ఐదే ళ్లు సీఎంగా ఉంటారు. తెలంగాణ ఎన్నికల గెలుపులో రేవంత్ రెడ్డి పాత్ర ఉంది' అని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు.

# స్మిత సబర్వాల్‌కి హైకోర్టులో బిగ్ రిలీఫ్

హైదరాబాద్, సెప్టెంబరు 25 : ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌కు తెలంగాణ హైకోర్టు లో ఊరట లభించింది. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ తన వివరణ కోరలేదంటూ ఇప్పటికే దాఖలైన పిటిషన్లతో కలిపి హైకోర్టు విచారణ చేపట్టింది. తదుపకాగా, స్మితా సబర్వాల్ పిటిషన్‌పై (గురువారం) హై కోర్టులో విచారణ జరిగింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ స్మితా సబర్వాల్ పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరంపై విచారణలో తన వివరణ కోరలేదని, 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని స్మితా సబర్వాల్ ఆరోపణలు చేసింది. అయితే, స్మిత సబర్వాల్ చర్యలను రిపోర్టులో పేర్కొంది పీసీ ఘోష్ కమిషన్.కాళేశ్వరం నిర్మాణాలపై స్మితా సబర్వాల్ రివ్యూ చేసిందని ఘోష్ కమిషన్ తెలిపింది.అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం వేళ.. స్మితా సబర్వాల్ చేపట్టిన చర్యలను జసిస్ట్ పీసీ ఘోష్ కమిషన్.. తన రిపోర్టులో స్పష్టంగా పేర్కొంది. అధికారిగా ఆమె కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై స్మితా సబర్వాల్ సమీక్ష చేసిందని కమిషన్ తన నివేదికలో వెల్లడించంది. అలాగే కొన్ని జిల్లాల్లో ఆమె పర్యటించి.. అందుకు సంబంధించిన ఫీడ్ బ్యాక్‌ను ఎప్పటికప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్మితా సబర్వాల్ చేరవేశారని జస్టిస్ పీసీ ఘోష్ విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.అదే విధంగా చీఫ్ మినిస్టర్ ఆఫీస్ స్పెషల్ సెక్రటరీ హోదాలో పలు సందర్భాల్లో ఈ మూడు బ్యారేజీలను స్మిత సబర్వాల్ సందర్శించారని తన నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పేర్కొంది. నిజా నిజాలు కేబినెట్ ముందు పెట్టినందుకు ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ ఈ సందర్భంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలంటూ స్మితా సబర్వాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరగనుంది. కొన్ని జిల్లాలు తిరిగి ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడూ అప్పటి సీఎం కేసీఆర్‌కి చేరవేశారని స్మిత సబర్వాల్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఆరోపణలు చేసింది. చీఫ్ మినిస్టర్ ఆఫీస్ స్పెషల్ సెక్రటరీ హోదాలో పలు సందర్భాల్లో స్మిత సబర్వాల్ మూడు బ్యారేజీలను సందర్శించారని కమిషన్ గుర్తుచేసింది. కాళేశ్వరంపై అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు జారీ చేయడంలో స్మిత సబర్వాల్ కీలకపాత్ర పోషించారని కమిషన్ చెప్పుకొచ్చింది. నిజానిజాలను కేబినెట్ ముందు పెట్టనందుకు స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌లో పేర్కొంది.




# సృష్టి ఆసుపత్రి కేసులో ఈడీ ఎంట్రీ

హైదరాబాద్, సెప్టెంబర్ 25: సరోగసి పేరుతో సృష్టి ఆసుపత్రి వేదికగా డాక్టర్ నమ్రత భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంట్రీ ఇచ్చింది. అందులోభాగంగా ఆమెను మరికొద్ది రోజుల్లో ఈడీ ప్రశ్నించనుంది.పిల్లలు లేని దంపతులనే లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమ్రత రూ. లక్షల్లో నగదు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అబార్షన్ కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు నగదు ఆశ చూపి ప్రసవం తర్వాత వారి పిల్లల్ని డాక్టర్ నమ్రత కొనుగోలు చేసేవారు. అనంతరం సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా పిల్లలు లేని దంపతులను నమ్మించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. ఇదే విషయాన్ని పోలీసులు తన నివేదికలో స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో డాక్టర్ నమ్రత జన్మించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్.. జేజేఎం మెడికల్ కాలేజీలో ఎండీ గైనకాలజీని ఆమె పూర్తి చేశారు. అనంతరం విజయవాలో తన వైద్య వృత్తిని ప్రారంభించారు. అలా ఫెర్టిలిటీ సెంటర్‌ను స్థాపించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు మారిన ఆమె.. సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నంలో సైతం ఈ కొత్త ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేశారు. అయితే డాక్టర్ నమ్రత.. ఏజెంట్ల సాయంతో గర్భస్రావం చేయించుకోవాలని ఆసుపత్రుల కు వచ్చే పేద మహిలను లక్ష్యంగా చేసుకుని.. ఈ దందా కొనసాగించారుఅలా మహిళలకు నగదు ఆశ చూపించి.. వారి గర్భాలను కొనసాగించేలా ఒప్పందాలు సైతం చేసుకున్నారు. దీంతో సంతానం లేని దంపతులకు ఆ మహిళల గర్భాన్ని సరోగసీగా చెప్పి.. వారి నుంచి రూ. 20 నుంచి 30 లక్షల వరకు వసూల్ చేశారు. ఇలా కోట్లాది రూపాయిలు సంపాదించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఈడీ సైతం ఈ కేసులో ఎంట్రీ అయింది. అంతేకాకుండా.. ఈ కేసులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈడీ ఎంట్రీతో ఈ కేసులో మరిన్ని సంచలన విషయాలు బహిర్గతం అవుతాయనే ఒక చర్చ సైతం సాగుతోంది.




# అలా ఎదగాలంటే స్వదేశీ వస్త్రాలు ఉపయోగించాల్సిందే

హైదరాబాద్, సెప్టెంబర్ 25: దిన్ దయాళ్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈరోజు (గురువారం) ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. దిన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన సందేశాన్ని మోదీ సాకారం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని జన్ ధన్ ఖాతాలు తెరిపించి బ్యాంకులకు చేరువ చేశారని.. దిక్కు లేని వారికి మోదీ దిక్కయ్యారని చెప్పుకొచ్చారు. 4 కోట్ల మందికి ఆవాసం నిర్మించారన్నారు. మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు.. అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని ఎంపీ పేర్కొన్నారు.ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపు ఇచ్చారన్నారు. అక్టోబర్ 2న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి.. చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారతదేశాన్ని అభివృ ద్ధిలో 4వ స్థానానికి మోదీ తీసుకువచ్చారని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ తగ్గించారని.. గొప్ప సంస్కరణ తీసుకువచ్చారని కొనియాడారు. అమెరికా లాంటి దేశాలు టారిఫ్ పేరిట ఇబ్బందులు పెడుతు న్నా.. దేశంలో అనేక స్టార్టప్ సంస్థలు తీసుకువస్తున్నారని అన్నారు. సేవ పక్వడలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపుని చ్చారు. 2047 వరకు దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగా లంటే వస్త్రాలు ఉపయోగించాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.



# గురుకుల నియామకాలపై హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్ :గురుకుల నియామకాల భర్తీకి సంబంధించి తెలంగాణ హైకోర్టు లో నమోదైన పిటిషన్‌ని తాజాగా విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది.తెలంగాణ గురుకుల నియామకాల వ్యవహారం హైకోర్టుకు చేరగా.. దీనిపై న్యాయస్థానం కీలక తీర్పు వెల్లడించింది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా.. మిగిలిన ఖాళీలను పిటిషనర్లతో భర్తీ చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల క్రితం 9 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో చాలా వరకు పోస్టులు మిగిలి పోయాయని.. వాటిని తదుపరి మెరిట్ లిస్ట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతూ పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. వచ్చే ఆరు నెలల్లోగా పిటిషనర్లతో ఈ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఖాళీలను పిటిషనర్లతో భర్తీ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 6 నెలల్లోగా ఈ భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపింది. కోర్టు తీర్పు వల్ల పిటిషనర్లకు ఉద్యోగం లభించే అవకాశం దక్కింది. దీనిపై పిటిషనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం అనగా 2023లో తెలంగాణ గురుకుల నియామక సంస్థ 9 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవరోహణ క్రమాన్ని పాటించలేదు. అలానే మెరిట్ ఉన్న క్యాండిడేట్స్‌కు మెరుగైన పోస్టులు వచ్చాయి. దీంతో నియామక ప్రక్రి యలో సమస్యలు తలెత్తాయి. అలానే చాలా పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. అయితే ఈ ఖాళీ పోస్టులను మెరిట్ జాబితాలో తర్వాత స్థానంలో ఉన్న అర్హులైన అభ్యర్థులకు కేటాయించాలని కోరుతూ. కొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. తాజాగా ఈ పిటిషన్లను విచారించిన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖాళీ ఉన్న పోస్టులను తర్వాత మెరిట్ వారితో అనగా పిటిషన ర్లతో చేయాలని హైకోర్టు తెలిపింది. ఈమొత్తం ప్రక్రియ ఆరు నెలల్లోగా ముగిసేలా చూడాలని అధికారులను ఆదేశించింది.



# సోషల్ మీడియాలో ఆ పోస్టులు పెడితే కఠిన చర్యలు: డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబరు 25: సోషల్ మీడియాలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారికి తెలంగాణ డీజీపీ జితేందర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు డీజీపీ. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు తెరవాలని ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఉత్తర్వులు జారీ చేశారు డీజీపీ జితేందర్. కాగా, ఇటీవల సోషల్ మీడియాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్న విషయం తెలిసిందే. ఎంతోమంది అమాయకులు వీటి బారీన పడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసులు సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలోనే సైబర్ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదల పెట్టవద్దని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఇలా చేస్తే సైబర్ నేరాలకు అడ్డుకట్టు వేయవచ్చని పోలీసులు భావిస్తున్నారు.




# గే యాప్ ద్వారా ఛాటింగ్ హొటల్‌కు వెళ్తే ఛీటింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 25:ప్రముఖ గే యాప్ అయిన గ్రైండర్ యాప్ ద్వారా పరిచయమైన యువకుడి చేతిలో మోసపోయిన మరో యువకుడు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. గ్రైండర్ యాప్ ద్వారా ఇద్దరు యువకులు ఛాటింగ్ చేసుకున్నారు. ఆ ఇద్దరిలో ఒకరు మాదాపూర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరూ కలవాలని నిర్ణయించుకుని అయ్యప్ప సొసైటీలో ఓయో రూమ్ బుక్ చేసుకున్నారుఆ ఓయో రూమ్‌కు వెళ్లిన తర్వాత డాక్టర్‌పై మరో యువకుడు అఘాయిత్యానికి పాల్పడడానికి ప్రయత్నించాడు . డాక్టర్ నిరాకరించటంతో అతడిపై దాడికి దిగాడు. తనకి డబ్బులు ఇవ్వకుంటే ఇలా ప్రైవేట్ గా కలిసిన విషయాన్ని ఇంట్లో చెబుతానని డాక్టర్‌ను ఆ యువకుడు బెదిరించాడు. దీంతో భయపడిన డాక్టర్ 5000 రూపాయలు చెల్లించి అక్కడి నుంచి బయటపడ్డాడు.బయటికి వచ్చాక ఆ డాక్టర్‌ను ఆ యువకుడు ఫాలో అయ్యాడు . డాక్టర్ పనిచేస్తున్న హాస్పిటల్ కి వెళ్లి న్యూసెన్స్ క్రియేట్ చేశాడు. మరిన్ని డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో సదరు డాక్టర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు గాలింపులు చేపడుతున్నారు.




# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 25 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్ పూర్, మెహర్ నగర్, గౌస్ కొండ, రామలింగంపల్లి, భీమనపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మానం, పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. జలాల్‌పూర్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్– 1, యూనిట్– 2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వన మహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, తడక వెంకటేష్, సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, మన్నె వెంకట్ రెడ్డి, అనిరెడ్డి జగన్ రెడ్డి, ఫకీరు నర్సిరెడ్డి, మార్కెట్ సుర్వి వెంకటేశ్, రేణిగుంట లాలయ్య, కుక్క దానయ్య, మద్ది అంజిరెడ్డి పాల్గొన్నారు.



# ఆ కాంట్రాక్ట్ ఉద్యోగులకు దసరా కానుక వచ్చేసింది

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెర్రాసిస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పనిచేస్తున్న ఫీల్డ్ స్టాఫ్‌ను.. ఇకపై భూభారతి కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ద్వారా వారిని టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణిస్తూ గౌరవప్రదమైన గుర్తింపు కల్పించింది. ఇప్పటివరకు ప్రైవేట్ సంస్థ తరఫున ధరణి ఆపరేటర్లుగా పనిచేసిన ఈ సిబ్బందిని.. తెలంగాణ భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌గా నియమించడం ద్వారా వారి భవిష్యత్తు మరింత స్థిరపడింది.ప్రభుత్వం తీసుకున్న మరో కీలక నిర్ణయం ఏంటంటే వేతనాల పెంపు. ఇంతవరకు రూ.12 వేల జీతం పొందుతున్న ఫీల్డ్ స్టాఫ్‌కు.. ఇప్పుడు రూ.28,148ల వరకు పెంచారు. దీంతో ఆ ఉద్యోగుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా నియమించడంతో పాటు.. జీతాలు కూడా పెరగడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న రాష్ట్రంలోనూ ఈ ఉద్యోగుల జీతాలు పెంపు ప్రకటన అనేది చెప్పుకోదగిన విషయం. దీన్ని "విజయదశమి కానుక"గా భావిస్తూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీసీఎల్ఏ లోకేష్ కుమార్, సీఎమ్మార్వో పీడీ మకరందం, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సహకారం గుర్తుచేశారు. ఫీల్డ్ స్టాఫ్ అసోసియేషన్ తమ చిరకాల కోరిక నెరవేర్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా వారికి ఆర్థిక భద్రత మాత్రమే కాకుండా.. ప్రభుత్వ యంత్రాంగంలో ఒక భాగమనే నమ్మకాన్ని కూడా పొందారు. దీని వల్ల భూభారతి ప్రాజెక్టు పనితీరు మరింత బలపడుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చర్చ
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం,
సెప్టెంబర్ 26, 2025



## వైసీపీ హయాంలో చిరంజీవిని అవమానించారంటూ బాలయ్య ఫైర్




**అమరావతి, సెప్టెంబర్ 25:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో (గురువారం) హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ ఫైరయ్యారు. జగన్ హయాంలో సినీ ప్రముఖులకు అవమానం జరిగితే గట్టిగా ఎవ్వరూ అడగలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో సినీ ప్రముఖులకు అవమానం జరిగిందంటూ సభలో ఎమ్మెల్యే కామినేని చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి బాలకృష్ణ ఆవేశంగా ప్రసంగించారు. ఆ రోజు సినీ ప్రముఖులను జగన్ కలిసేందుకు ఇష్టపడకపోతే.. చిరంజీవి గట్టిగా ఆడిగాక జగన్ సినీ ప్రముఖులను కలిశారన్న కామినేని వ్యాఖ్యలతో బాలయ్య ఏకీభవించలేదుకామినేని మాటలకు అభ్యంతరం వ్యక్తం చేసిన బాలకృష్ణ.. ఆ రోజు గట్టిగా అడిగిన వారెవ్వరూ లేరని సభకు స్పష్టం చేశారు. ఆ సైకోని కలిసేందుకు తనకు ఆహ్వానం వచ్చినా వెళ్లలేదన్న విషయాన్ని బాలకృష్ణ గుర్తు చేశారు. చిరంజీవిని అవమానించారని అనడం వరకూ వాస్తవమే అని చెప్పిన బాలకృష్ణ.. కూటమి ప్రభుత్వంలోనూ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ తనది 9వ పేరుగా ముద్రించిందన్నారు. ఇలా రాసింది ఎవరని, ఆరోజే దానిపై తాను అభ్యంతరం వ్యక్తం చేశానని బాలకృష్ణ ఆగ్రహించారు. అసెంబ్లీకి స్పష్టత ఇవ్వాలనే తాను ఈ అంశంపై స్పందించానన్న బాలకృష్ణ.. ఏదైనా తప్పు మాట్లాడితే క్షమించండంటూ సభను కోరారు.

## దసరా నవరాత్రులు డ్రెస్ కోడ్‌తో అసెంబ్లీకి ఎమ్మెల్యేలు





**అమరావతి, సెప్టెంబర్ 25:** దసరా నవరాత్రులు ప్రారంభమైనాయి. ఈ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనాయి. ఈ నేపథ్యంలో నవరాత్రుల్లో రోజూ అమ్మవారికి ఏ రంగు దుస్తులతో అలంకరిస్తున్నారో.. అదే రంగు వస్త్రాలతో అసెంబ్లీకి వెళ్లాలని వారంతా నిర్ణయించారు. అందులో భాగంగా గురువారం అంటే నవరాత్రుల్లో నాలుగో రోజు అమ్మ వారు శ్రీకాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు.దీంతో మహిళా ఎమ్మెల్యేలంతా ఈ రోజు పసుపు రంగు దుస్తులు ధరించిన అసెంబ్లీకి హాజరయ్యారు. అయితే రాష్ట్రాన్ని చల్లగా చూడాలని ఆ దుర్గమ్మను తామంతా వేడుకున్నామని వారు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజలకు సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో తామంతా ఈ డ్రెస్ కోడ్‌ను పాటిస్తున్నామని వారు వివరించారు. ఇక దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలు ప్రారంభమైనాయి. సెప్టెంబర్ 23వ తేదీన ఈ నవరాత్రలు ప్రారంభమైనాయి. ఇవి అక్టోబర్ 2వ తేదీతో ముగియనున్నాయి.మరో వైపు అసెంబ్లీలో ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకాలను పార్టీ నేత టీడీ జనార్దన్ అందజేశారు. అనంతరం సభ ముఖ ద్వారం వద్ద వారంతా ఎన్టీఆర్ పుస్తకాలు పట్టుకుని గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా జై ఎన్టీఆర్, జోహార్ ఎన్టీఆర్ అంటూ వారంతా బిగ్గరగా నినాదాలు చేశారు.

## విశాఖ టు సియోల్ పోరాటానికి సలాం.




**విశాఖ :**దక్షిణకొరియాలో విశాఖ ఎల్జీ పాలిమర్స్ బాధితులు ఆందోళన చేపట్టారు. సియోల్‌లోని హెడ్‌క్వార్టర్స్ ట్విన్ టవర్స్ ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గ్యాస్ లీక్ మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోన్న వందలమంది కార్మికులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఘటన అనంతరం ఎల్జీ పాలిమర్స్ నుంచి ఎలాంటి సాయం అందలేదని బాధితులు పేర్కొన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా ఎల్జీ పాలిమర్స్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.కాగా.. 2020 మే 7న విశాఖ ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరిన్ గ్యాస్‌లీకై 15మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ ఇంకా చాలామంది చనిపోయారనేది ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. అయితే, ఆ 15మంది మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇచ్చింది అప్పటి వైసీపీ ప్రభుత్వం అంతేకాదు, ఆస్పత్రిపాలైన వారికి కూడా సాయం అందించింది. ఆరోజు 6 వందల మందికి పైగా అస్వస్థతకు గురికాగా.. దాదాపు 20వేల మందిపై ఆ ప్రభావం పడింది. ఇప్పటికీ వందలాది మంది అనారోగ్యంతో బాధపడుతూ ట్రీట్‌మెంట్‌కి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ ప్రమాదం జరిగి ఐదేళ్లు దాటిపోతున్నా.. ఇప్పటివరకూ కంపెనీ ఆదుకోలేదంటున్నా రు బాధితులు..ఐదేళ్లుగా కంపెనీని అడిగిఅడిగీ అలసిపోయి.. దక్షిణకొరియాలోని హెడ్‌క్వార్టర్స్ ముందు నిరసనకు దిగామంటున్నారు బాధితులు.. సియోల్‌లోని హెడ్‌క్వార్టర్స్ ట్విన్ టవర్స్ ముందు ఆందోళన చేపట్టిన ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్.. బాధితులకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ బాధితులకు అండగా పలు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు నిలిచాయి. విశాఖ నుంచి సియోల్ తీసుకెళ్లి.. హెడ్‌క్వార్టర్స్ ముందు నిరసన తెలిపేలా చేశారు.. అంతకుముందే మూడు ప్రధాన డిమాండ్లతో నాయకత్వానికి ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతిపత్రం సమర్పించింది.

## రాజకీయాల్లో నలిగిపోతున్నా




**అమరావతి:** ఏపీ రాజకీయాల్లో జనసేన పార్టీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. పార్టీలో అంతర్గత రాజకీయాలు, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం, పవన్ సీఎం కావడం.. ఇలా పలు కీలక అంశాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు తాడేపల్లి గూడెం జనసేన పార్టీ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ . సీనియర్ జర్నలిస్ట్ జాఫర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని తనకు ఉందని.. పవన్ కళ్యాణ్ ఏ నిర్ణయం తీసుకున్నా శిరోదార్యమన్నారు. పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడతారో మైకు ముందుకు వచ్చేవరకు ఎవరికి తెలియదని.. ఆయన ఏం చెప్పాలనుకున్నా ఓపెన్‌గా చెబుతారన్నారు.రేపు తనకు పదవి లేకపోయినా పవన్ కళ్యాణ్ వెంట ఉంటానన్నారు బొలిశెట్టి శ్రీనివాస్ . తనకు పదవి అక్కర్లేదని.. ఐదేళ్ల తర్వాత తనకు అసలుఎలాంటి పదవి అవసరం లేదు (వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను) అన్నారు. తన తర్వాత సమాజానికి సేవ చేసేవాళ్లను ప్రజలు కచ్చితంగా ఎన్నుకుంటారన్నారు. తాను రాజకీయాల్లో నలిగిపోతున్నానని.. తన వ్యాపారం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తనకు ఫ్రీడమ్ లేకుండా పోయిందన అందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. జనసేన పార్టీలో కాపులు ఉంటే తప్పేంటని.. రాజకీయ పార్టీలన్న తర్వాత అన్ని కులాల వాళ్లు ఉంటారన్నారు.చిన్న, చిన్న విషయాలు చెప్పొద్దని పవన్ తమతో అంటారని వివరించారు. పవన్ కళ్యాణ్ ఏది ఉన్నా ముక్కుసూటిగా మాట్లాడతారని.. తాను కొన్ని సందర్భాల్లో ఉన్న వాస్తవాలు చెబుతానన్నారు. కూటమిని ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో కొన్ని అంశాలను ప్రస్తావించకపోవడమే మంచిదన్నారు.

## గంజాపై పటిష్ట చర్యలు తగ్గేదేలే అన్న హోంమంత్రి



**అమరావతి, సెప్టెంబర్ 25:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాంతిబద్రతలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. గతంలో పోలీసులను అతిగా ఉపయోగించడం జరిగిందని.. దానికి నిదర్శనమే 151 నుంచి 11 సీట్లకు జగన్ మోహన్ రెడ్డి పడిపోయారని అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌తోపాటు పలువురుపై పోలీసులను ప్రయోగించారని గుర్తుచేశారు. చాలా మందికి తాము ఎందుకు జైలుకు వెళుతున్నామో కూడా తెలియని పరిస్థితి అప్పట్లో ఉండేదన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి ఎంతో ప్రయత్నించామని... ఈ ఏడాది రాష్ట్రంలో 16 శాతం నేరాలు తగ్గాయని వెల్లడించారు. బలహీన వర్గాలు, మహిళలపై నేరాల సంఖ్య రాష్ట్రంలో తగ్గిందని సభకు తెలియజేశారు.గతంలో విపరీతంగా గంజాయి పెరిగిపోయిందని.. అప్పట్లో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉండేవని.. చివరకు స్కూళు బ్యాగుల్లోకీ గంజాయి చేరిపోయిందన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వంలో నిఘా విఫలం అయ్యిందని చెప్పడానికి కారణం గంజాయి విపరీతంగా పెరిగిపోవడమే అని వెల్లడించారు. లిక్కర్ రేటు పెరిగిపోవడంతో గంజాయిని చాలా మంది మత్తు కోసం ఆశ్రయించారని హోంమంత్రి తెలిపారు. సెబ్‌ను రద్దు చేసి ఈగల్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసి ఐపీఎస్ అధికారితో పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఈరోజు గాంజా కల్టివేషన్ రాష్ట్రంలో జీరోకి చేరిందని పేర్కొన్నారు.జనవరి 1 నుంచి ఈరోజు వరకు 32 వేల కేజీల గాంజాను సీజ్ చేశామని సభలో వెల్లడించారు. మెడికల్ షాపులలో డ్రగ్స్‌కు సంబంధించినవి దొరుకుతున్నాయని సభ్యులు తమ దృష్టికి తెచ్చారని.. దీనికి వ్యతిరేకంగా ఆపరేషన్ గరుడా, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ అని నడిపామని తెలిపారు. 40 వేల బడ్డీలపై రైడ్ చేశామని... ఆపరేషన్ చైతన్య, సంకల్పలను పాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్లు మహిళల క్యారెక్టర్‌ను దిగజార్చి మాట్లాడారని మండిపడ్డారు. ఉమెన్, చైల్డ్ సేఫ్టీకి ఒక మహిళా ఐపీఎస్‌ను పెట్టి శక్తి యాప్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఒక అమ్మాయి.. ఇబ్బందుల వల్ల రైలు పట్టాలవైపు వెళుతుంటే అది చూసిన వారు శక్తి బృందానికి సమాచారం ఇచ్చారని.. ఆ బృందం వెళ్లి ఆ అమ్మాయిని రక్షిస్తే ఆమె ఇప్పుడు డీఎస్సీ రాసి ఉద్యోగం సాధించారని హోంమంత్రి అనిత తెలియజే శారుజగన్ ఓ ఆర్గనైజ్డ్ క్రిమినల్..ఫోరెన్సిక్ కేసులు 25వేలు పెండింగ్‌లో ఉంటే కూటమి వచ్చాక వాటిని 1600కి తగ్గించగలిగామని తెలిపారు. ఇప్పుడు కన్విక్షన్ రేటు కూడా పెరిగిందన్నారు. సోషల్ మీడియా ఎంత మంచికి ఉపయోగించినా ఇప్పుడు చెడుకూ ఉపయోగిస్తున్నారని అన్నారు. జగన్ ఓ ఆర్గనైజ్డ్ క్రిమినల్ అని సాక్షాత్తూ చంద్రబాబు చెప్పారన్నారు. సోషల్ మీడియాలో కావాలని ఫేక్ పేర్లతో కులాలు మార్చుకొని మరీ పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లోకి వచ్చిన పాపానికి మన పిల్లలు కూడా మాట పడాల్సి వస్తోందని ఫైర్ అయ్యారు. డిప్యూటీ సీఎం పిల్లల గురించి కూడా ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారని ఆగ్రహించారు.నా దృష్టికి తీసుకురండి: హోంమంత్రిజర్నలిస్టులు, అమరావతి మహిళలపైనా అనేక కేసులు అప్పట్లో పెట్టారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి భార్య, ఓ ముఖ్యమంత్రి కుమార్తెను అన్న మాటలే ప్రజల్లో మార్పునకు కారణమని చెప్పవచ్చన్నారు. సభ్యులకు చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని తనకు అర్థం అవుతోందని.. వాటిని తన దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామని హోంమంత్రి పేర్కొన్నారు.

## వైసీపీ అరాచకాలపై సీఎం చంద్రబాబు సంచలన ఆరోపణలు



**అమరావతి, సెప్టెంబర్ 25:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాంతి భద్రతల అంశంపై స్వల్ప కాలిక చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. శాంతిభద్రతలు- సామాజిక మాధ్యమాల అంశంపై సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం గురించి పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారని తెలిపారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపైనా అత్యాచారయత్నం కేసులు పెట్టారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన అక్రమకేసుల బాధితులే అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తనపై 17 కేసులు పెట్టి వేధించారని.. ఇది అరాచకానికి పరాకాష్ట అంటూ ఫైర్ అయ్యారు.ఎన్నో వేధింపులు.యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేష్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారని.. 'అంగళ్లలో గత పాలకులు నాపై దాడి చేసి తిరిగి నాపైనే కేసులు పెట్టారు' అని గుర్తుచేశారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారని మండిపడ్డారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్ రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి ఇలా నేతలందరిపై కేసులు పెట్టారని తెలిపారు సీఎం.అందరిపైనా కేసులే.గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే అని అన్నారు. రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసినప్పుడు తమకు నిద్ర లేకుండా పోయిందని అప్పటి దారుణాలను సీఎం వివరించారు. అమరావతి రైతులు రాజధాని కోసం పోరాడుతుంటే.. స్నానాలు చేసే బాత్ రూమ్‌లపై డ్రోన్లు ఎగరేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పాదయాత్రలోనూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారన్నారు. వీళ్ల అరాచకాలు భరించలేక పారిశ్రామిక వేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారని తెలిపారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయా రని. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.వారినే భయపెట్టేశాత్యంత గౌరవప్రదమైనదన్నారు. చివరకు ట్రంప్, కిమ్‌కు చర్చలు సింగపూర్‌లో పెట్టారని తెలిపారు. సింగపూర్‌లో నైట్ క్లీనింగ్ చూసి హైదరాబాద్‌లో ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో రాజధానిని కడతామని చెప్పామని.. సింగపూర్‌కు సమానంగా కడతామని తెలిపారు. అక్కడిం మాస్టర్ అలాంటి వాళ్లను వీళ్లు బయపెట్టారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు.

## శాంతిభద్రతలపై చర్చ అయ్యన్న కీలక కామెంట్స్



**అమరావతి, సెప్టెంబర్ 25:** రాష్ట్రంలో శాంతిభద్రతలపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. 'సభాపతిగా నేను ఈ కుర్చీలో కుర్చున్నా నాకు కూడా కొంత ఆవేదన కలుగుతోంది. ప్రెస్ మీట్, సోషల్ మీడియాలో రోజు చూస్తున్నాం వారు మాట్లాడే తీరు. మళ్లీ మేమే వస్తాం మీ అంతుచూస్తాం, పీకలు కోస్తాం. రప్పా రప్పా అంటూ సినిమా డైలాగులు. ఎన్టీఆర్ పార్టీలోనే మేము కూడా ఓడిపోలేదా. ఓడిపోతే రప్పా రప్పా నా.... ఇందిరా గాంధీ వంటి మహానాయకురాలు ఓడిపోలేదా. మీలా మాట్లాడలేను ఆవేశం వస్తుంది.. అయితే కంట్రోల్ చేసుకోవాల్సి వస్తుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు వస్తాయని.. అయితే ప్రతిపక్షంగా ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడంలో లోటుపాట్లు ఉంటే అసెంబ్లీకి వచ్చి చెప్పాలని సూచించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని... ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇక్కడ ఉంటారని తెలిపారు. సభకు రారు, ఎమ్మెల్యేలను రానివ్వరు... క్వశ్చన్‌లు మాత్రం పంపుతున్నారని.. ప్రజలు దీన్ని ఖండిచాల్సిన అవసరం ఉందన్నారు. 'రాజకీయ కారణాలతో కొంతమంది సభ్యులు వెళ్లిపోతే.. ఆయన తనకు నెంబర్ లేదని సభకు వచ్చి ప్రతిపక్షనేతగా రాజీనామా ఇచ్చేశారు. ఇప్పుడు నెంబర్ లేకుండా నాకెందుకు ఇవ్వరు అంటున్నారు. చివరకు నాపై హైకోర్టుకు వెళ్లారు.. ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్లారు. నేను ఎక్కువ మాట్లా డలేను.. అయినా మాట్లాడాలి అనిపించింది. పిల్లల భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్త కోసం అందరూ పనిచేయాలి' అని స్పీకర్ అయ్య న్నపాత్రుడు పిలుపునిచ్చారు.కాగా.. శాసనసభలో రాష్ట్రంలో శాంతి భద్రతలు అంశంపై చర్చను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ రావు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని విమర్శించారు. సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులను హరించారని మండిపడ్డారు. పల్నాడులో రాజకీయ కక్షతో హత్యలు చేశారని గుర్తుచేశారు. చంద్రయ్యను పట్టపగలు నడి రోడ్డు పై హత మార్చారని తెలిపారు. అందుకనే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మట్టి కరిపించారంటూ యరపతినేని వ్యాఖ్యలు చేశారు.

## మంత్రి సమాధానంతో అసంతృప్తి మండలి నుంచి బొత్స వాకౌట్



**అమరావతి, సెప్టెంబర్ 25:** ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ ఇచ్చిన సమాధానంపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి మోసపూరితమైన మాటలు నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను , ప్రజలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగుల ఆవేదనకు మద్దతు తెలుపుతూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నామంటూ బొత్స సత్యనారాయణ సభ నుంచి వెళ్లిపోయారు.అంతకుముందు మంత్రి పయ్యావుల ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత సర్కార్ దుర్మర్గంగా వ్యవహరించిందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్‌ను వివిధ అవసరాలకు వాడుకుని... ఇప్పుడు ఉద్యోగుల విషయంలో మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చిందన్నారు.ఐఆర్ కంటే తక్కువగా 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేశారని.. కరోనా పేరు చెబుతూ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌ను వైసీపీ సర్కార్ తగ్గించిందని విమర్శించారు. ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యో గుల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. సరైన సమయంలో సీఎం చంద్రబాబు పీఆర్సీ నియామకంపై చర్యలు తీసుకుంటారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## ఉద్యోగులపై జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది



**అమరావతి , సెప్టెంబరు 25 :** పీఆర్సీ పునర్నిర్మాణం బకాయిల చెల్లింపు అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలిలో (గురువారం) ప్రశ్నోత్తరాలు జరిగాయి. ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహారించిందని ఆరోపించారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును సైతం జగన్ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసిందని విమర్శించారు. ఇప్పుడు వైసీపీ నేతలు ఉద్యోగుల విషయంలో దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా జగన్ ప్రభుత్వం మోసం చేసిందని ఆక్షేపించారు. ఎన్నికల వాగ్దానాలను గుర్తుపెట్టుకుని అమలు చేసి ఉంటే వైసీపీకి సింగిల్ డిజిట్ వచ్చేది కాదని చెప్పుకొచ్చారు మంత్రి పయ్యావుల కేశవ్.గత జగన్ ప్రభుత్వం 94 కేంద్ర ప్రభుత్వ పథకాల సొమ్మునూ ఇతర అవసరాలకు వాడేసిందని గుర్తుచేశారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుందని ఉద్ఘాటించారు.కరోనా పేరు చెప్పి గత జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన దానికంటే ఎక్కువ నిధులు తీసుకుందని వివరించారు మంత్రి పయ్యావుల కేశవ్.రెండేళ్లుగా రావాల్సిన రెవెన్యూ లోటు మొత్తాన్ని కరోనా పేరు చెప్పి ముందే ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. రూ.40 వేల కోట్ల అదనంగా వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిందని గుర్తుచేశారు. ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి తీసుకుంటున్నామని వివరించారు. 2024 నుంచి 2025 మధ్యలో ఉద్యోగులకు సంబంధించి రూ. 11,496 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. 2025నుంచి 2026లో ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు రూ.3,549 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపీఆర్సీ నియామకంపై సరైన సమయంలోనిర్ణయం తీసుకుంటారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# అమెరికా ఆంక్షలకు అనుగుణంగా సాగాలి

అమెరికా అధ్యక్షుడు ట్రంపు లేపుతున్న కంపు కారణంగా ప్రపంచ దేశాలు అనేక ఇబ్బందుల్లో పడుతున్నాయి. ప్రధానంగా భారతదేశ యువత పరిస్థితి డోలాయమానంలో పడింది. ఎంఎస్, ఎంబిఎ చదువులు అక్కడే చదివి ఉద్యోగాలు పొందాలన్న వారి కలలపై ట్రంప్ నీళ్లు చట్టారు. ఇటీవల హెచ్-1 బి వీసాలను వ్యాపారంగా మార్చడంతో ఇప్పుడు అమెరికా వెళ్ళి ఇక చదువుకోవడం కష్టంగా మారింది. ఇకపోతే అమెరికాలో ఉన్నత చదువులు చదివిన భారతీయలు ఉద్యోగాలు లేక అక్కడ మగ్గుతున్నారు. మన దేశంలో ఉద్యోగాలు దక్కక ఎంతోమంది విదేశాలకు వెళ్లినా వారికి భరోసా దక్కడం లేదు. అటు ఉద్యోగాలు దొరక్క..బ్యాంకు రుణాలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పోనీ దేశానికి వచ్చి ఇక్కడేమైనా చేద్దామా అంటే ఇక్కడా పరిస్థితి దారుణంగా ఉంది. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ఉన్న ఉద్యోగులను మెల్లగా తీసేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారం పట్ల దృష్టిసారించాల్సిందిపోయి నిర్లిప్తంగా ఉంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ పథకాలతో రాటుదేలాయి. విద్యా,ఉపాధి రంగాలను ప్రోత్సహించడం లేదు. విదేశాలపై ఆధారపడి వద్దంటున్న ప్రధాని మోడీ ఇక్కడ ఉపాధి, ఉద్యోగ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామన్న భరోసా ఇవ్వడం లేదు. రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా పాలన సాగించడం లేదు. ఈ క్రమంలో ముందు ఆర్థిక వ్యవస్థ బలపడాలి. తరవాత స్వయం ఉపాధి పథకాలు భారీగా చేపట్టాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశంగా చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. నిజానికి మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం కావాలి. కానీ అలా జరగడం లేదు. అమెరికా లాంటి దేశాలు ఆంక్షలు విధిస్తే అతలాకుతలం కావడం మినహా గత్యంతరం లేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పుడు యువత మిగతా దేశాల వైపు చూస్తోంది. ఈ క్రమంలో కేంద్రం కఠిన నిర్ణయాలతో ముందుకు రావాల్సి ఉంది. ఇకపోతే రాష్ట్రాల్లో కులవృత్తులకు ప్రోత్సాహం దక్కడంలేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగులను గట్టెక్కించే చర్యలకు బదులు, పన్నుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఉద్యోగ,ఉపాధి రంగాలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. డాలర్ బలపడుతుందే తప్ప రూపాయి బలపడడం లేదు. రోజురోజుకూ రూపాయి మరింత బలహీనం అవుతోంది. దీనిని పట్టించుకోక పోవడం వల్ల మాంద్యం దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. కారణాలను ఎవరో ఒకరిమీద నెట్టి తప్పించుకోవడం కన్నా దూరదృష్టితో సాగివుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు. అమెరికా పెడుతున్న ఇబ్బందులు, సుంకాల నేపథ్యంలో డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే ఎగుమతులకు ప్రాధాన్యం పెరగాలి. అనవసర దిగుమతులకు కళ్లెం వేయాలి. లేకుంటే విదేశీ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది. ఈ దశలో ఆర్థిక మందగమనానికి చికిత్స వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే



ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఆర్థికవృద్ధికి ఊతమిచ్చేందుకు చర్యలను ప్రకటించి అమలు చేయాలి. కేవలం జిఎస్టీ తగ్గింపులే కాకుండా దేశీయంగా వస్తూత్పత్తి ధరలు దిగివచ్చేలా చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందు బాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణ వితరణలో ప్రతికూల వృద్ధి నమోద యింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగు తుండటం, అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు, యుద్దాలు కూడా మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరెన్సీలు దారుణంగా పతనమవడం వంటి అంశాలు మన విదేశీ మారకపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగు తుంది. విదేశీ ప్రయాణాలు, చదువుల ఖర్చులు భారమవుతాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి సరకులు ప్రియమవుతాయి. అప్పుడు ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకుంటాయి. పరోక్షంగా ఇది దేశ అభివృద్ధిని అడ్డుకుంటుంది. దీంతోపాటు డాలర్ బలపడుతున్నందున, విదేశీ మదుపర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరిస్తే, ఈక్విటీ మార్కెట్లు నష్టపోతాయి. ఈ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ హయాంలో వృద్ధిరేటు ఎక్కువ ఉందంటే తమ హయాంలోనే అని వాదులా డుకున్నాయి. కానీ జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఫలాల పంపకం ఏ రీతిన ఉన్నదో చూడడం లేదు. అభివృద్ధి అన్నది ఉద్యోగ కల్పనకు గీటురాయిగా ఉండాలి.

# శ్రీశైలం,సాగర్‌లకు పెరుగుతున్న పర్యాటకులు

- పూర్తిస్థాయికి రెండు జలాశయాలు
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

**నాగార్జునసాగర్,సెప్టెంబర్25:** నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండ ను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ఎగువన వర్షాలతో మరింతగా వరదవచ్చి చేరుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా



తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.



# ఉల్లిధరలతో కర్నూలు రైతు దిగాలి

- సాగు పెరిగినా..దక్కని గిట్టుబాటు ధరలు

**కర్నూలు,సెప్టెంబర్25:** రాష్ట్రంలో ఉల్లి ఘాటు క్రమంగా పెరగాల్సిన ప్రస్తుత సీజన్‌లో రైతులు దిగాలు పడ్డారు. ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నా, రైతులకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. 1200కు క్వింటా అని ప్రభుత్వం చెప్పినా ఆ ధరలు కూడా రావడం లేదంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరలు పతనం అవుతున్నాయి. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి వర్షాల కారణంగా ఉల్లి సరఫరా ఆగిపోయిందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 4-5 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. అయినా రైతులకు మాత్రం ధరలు దక్కడం లేదు. దీంతో హోల్‌సేల్ ధరే కిలో రూ. 20 నుంచి 25కి చేరింది. కర్నూలు జిల్లాలో మార్కెట్‌లోకి ఉల్లి ఈ యేడు భారీగా చేరింది. వర్షాల పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరిగినా ధరలు మాత్రం పెరగడం లేదని అంటున్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతుందని భావించారు. దీంతో ఇక్కడి రైతులకు డిమాండ్ వస్తుందని భావించారు. ఈ యేడు దేశంలో ఉల్లి సాగు విపరీతంగాపెరగడంతో ధరలు దిగివచ్చాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 వరకు మాత్రమే అమ్మడువతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 20 రూపాయలు పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చేది. సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. కానీ కర్నూలు రైతులు విపరీతంగా సాగు చేయడంతో దిగుబడులు పెరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచడంలేదు.



# యథాతథంగా ఇసుక వ్యాపారం

## దాడులకు చలించని అక్రమార్కులు

**ఆదిలాబాద్,సెప్టెంబర్25:** ఇసుకకు ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో వ్యాపారు లకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రతి ఒక్కరూ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఇసుక దందాను ఎంచుకుంటున్నారు.ఇసుక రవాణాను అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారులు జోరుగా ఇసుక తరలిస్తూ నిల్వ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా దందా మాత్రం ఆగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇసుకను తోడుకుని అమ్ముకోవడంతో వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రస్తుతం వరదనీరు గంగలోకి రావడంతో ఇసుక తీసే వీలులేక ప్రస్తుతం తాంసి(కె) నుంచి పిప్పల్‌కోటి మీదుగా కప్పర్ల,



బండల్‌నాగాపూర్, పొచ్చేర, లేకపోతే సావర్గాం, జంధాపూర్ గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. తాంసి(కె) వద్ద గంగాలోని ఇసుక బాగుండడంతో భారీ రేటు కూడా పలుకడంతో ట్రాక్టర్‌ల యాజమానులు, వ్యాపారులు పెన్‌గంగ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ ద్వారా ఒక్కొ ట్రాక్టర్ ద్వారా రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రింపు ఇసుకను రూ.3 నుంచి నాలుగు వేలకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెన్‌గంగ నుంచి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం కానరావడం లేదు. గ్రామాలలో స్థానికంగా ఉన్న చిన్నచిన్న అవసరాల మేరకు ఇసుకను వాడుకునేందుకు ఇచ్చిన అవకాశాన్ని దర్వినియోగం చేస్తూ కాంట్రాక్టర్‌లకు, ఇతర అవసరాలకు ఇసుకను రవాణా చేస్తూ కాసులు సంపాదించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇసుకు పెన్‌గంగా నది నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇసుక తరలిస్తూ ట్రాక్టర్‌లు పట్టుబడితే నామమాత్రంగా జరిమానా విధిస్తూ చూసిచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు తమ పంథాను మార్చుకోకుండా ఇసుకను తరలిస్తున్నారు. పెన్‌గంగా నదితీరం నుంచి గంగాపై భాగంలో ఇసుకను రవాణా చేసే వ్యాపారులు ఇసుక డంప్లులను ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేసుకుంటున్నారు. పెన్‌గంగా నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ఇసుక కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం పెన్‌గంగా నదిలోకి వరదనీరు చేరితే ఇసుక తీసే అవకాశం ఉండదు..

చర్చ
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం,
సెప్టెంబర్ 26, 2025



# నా బొందిలో ప్రాణమున్నంతవరకూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడతా



**చెన్నై:** తన బొందిలో ప్రాణమున్నంతవరకూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతూనే ఉంటానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి దివంగత నేత కరుణానిధిని ఆదర్శంగా తీసుకుని శ్రమించడమే కాకుండా, అందరికీ అన్ని సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. గురువారం ఉదయం తన నియోజకవర్గం కొళత్తూరులో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారపెరంబూరు పేపర్‌మిల్స్ రోడ్డులో రూ.8.20 కోట్లతో మురసొలి మారన్ ఉద్యానవనం పునర్నిర్మాణ పనులకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.13.95 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొళత్తూరు నియోజకవర్గంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.8.65 కోట్లతో నిర్మించిన రెండు పాఠశాల భవనాలు, పునర్నించిన ఫుట్‌బాల్ మైదానాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. చివరగా పెరియార్ నగర్ క్రీడామైదానంలో అనితా అఛీవర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 126 మంది విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాపలు, సర్టిఫికెట్లు, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో అడుగుపెట్టగానే తనలో సంతోషం ఏర్పడుతుందని, ఈ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఆనందిస్తున్నానని చెప్పారు. రెండు గంటలపాటు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని అనితా అఛీవర్స్ అకాడమీలో విద్యార్థులందరినీ చూడగానే తనలో మరింత చురుకుదనం ఆవహిస్తోందని చెప్పారు.ఈ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నవారంతా తమ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలలో మరింతగా ప్రతిభాపాటవాలను పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పోటీ యుగంలో అంతర్జాలంలో లభించని సమాచారం అంటూ ఏదీ లేదని, అన్వేషిస్తే అన్ని వివరాలు అర్థమవుతాయన్నారు. ఆన్‌లైన్ కోర్సులపై కూడా యువత దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, రాజ్యసభ సభ్యుడు గిరిరాజన్, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసెఫ సామువేల్, డిప్యూటీ మేయర్ మహేషకుమార్, డీఎంకే స్థానిక నాయకులు నాగరాజన్, ఐసీఎఫ్ మురళి పాల్గొన్నారు

# మాజీసీఎం సంచలన కామెంట్స్ మా పార్టీ ఎవరికీ తలవంచదు



**చెన్నై:** అన్నాడీఎంకే ఎవరికీ తలవంచదని, మిత్రపక్షాలను బానిసలుగా చూడటం డీఎంకే నైజమని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం-తమిళగతై మీడ్పోం' అనే నినాదంతో నియోజకవర్గాల వారీగా ఈపీఎస్ చేస్తున్న ప్రచారయాత్ర బుధవారం నీలగిరి జిల్లాలోని గూడలూరు నియోజకవర్గానికి చేరుకుంది. దేశంలోనే ఉన్నత విద్యలో తమిళనాడును అగ్రస్థానంలో నిలిపిన ఘనత అన్నాడీఎంకే ప్రభుత్వానిదేనని, అందుకే ఆ రంగానికి అధిక నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా కేంద్రప్రభుత్వం తో సన్నిహితంగా మెలిగి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, పథకాలను ఏ మాత్రం జాప్యం లేకుండా పొందడంతో పాటు కేంద్రాన్ని మెప్పించి ప్రభుత్వ వైద్యకళాశాలలను కూడా తీసుకొచ్చింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని, అయితే ఈ డీఎంకే హయాంలో ఇలాంటి ఏ పథకాన్నికూడా తీసుకురాలేపోయారని విమర్శించారు. దేశంలో అధికంగా అప్పులు చేయడంలో తమిళనాడు అదర్శవంతంగా ఉం దని, అవినీతి, కమీషన్, కరప్షన్‌లో కూడా డీఎంకేకు సాటి ఎవరూలేరని ఈపీఎస్ ధ్వజమెత్తారు.1999లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమిలో డీఎంకే వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వంలో డీఎంకే తరుపున మురసొలిమారన్ కేంద్రమంత్రిగా పనిచేశారని, అప్పుడు బీజేపీని మంచిపార్టీగా డీఎంకే అభివర్ణించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న బీజేపీని మతవాద పార్టీగా డీఎంకే విమర్శించడం సరికాదన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో ఎమర్జెన్సీ చట్టం అమలుకు వచ్చిందని, అప్పుడు డీఎంకే నేతలతో పాటు స్టాలిన్‌ను కూడా జైలుకెళ్లారని, అయితే తమను జైలుపాలు చేసిన కాంగ్రెస్ తో ఎందుకు పొత్తు కుదుర్చుకున్నారో ఆ భగవంతునికే ఎరుకన్నారు. డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో సీబీఐ తనిఖీలతర్వాతే కాంగ్రెస్ తో డీఎంకే పొత్తు కుదుర్చుకుందని, ఈ వాస్తవాన్ని పక్కనబెట్టి అన్నాడీఎంకే బీజేపీకి బానిసైందని విమర్శించడం న్యాయంకాదన్నారు. నీలగిరి జిల్లాలో సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్నవారి నుంచి వెయ్యి చదరపు అడుగుల ఇంటిప్లాను గుర్తింపుకు ఈ ప్రభుత్వం రూ.74వేలు వసూలు చేస్తోందని, అలాగే అన్ని రంగాల్లో పన్నులు పెంచిందని, అధికంగా అప్పులు పొంది ఓటేసి గెలిపించిన ప్రజలపై ఆర్థికభారం మోపిన డీఎంకే ప్రభుత్వాన్ని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ప్రజానీకాన్ని ఈపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# బేబీ అంటూ మెసేజీలు ఆ తరువాత బెదిరింపులు



**ఢిల్లీ:** ఢిల్లీలోని ప్రముఖ ఆశ్రమానికి చెందిన స్వామి చైతన్యానంద సరస్వతిపై లైంగికారోపణల కేసులో పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు. వసంత్ కుంజ్ ప్రాంతంలోని శ్రీ శారద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినులను ఆయన వేధించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే% కాలేజీలో చదువుకుంటున్న తమను స్వామి చైతన్యానంద సరస్వతి వేధించినట్లు పలువురు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తమపై బెదిరింపులకు దిగేవారని కూడా కొందరు ఆరోపించారు. ఆగస్టులో దాఖలైన ఈ ఎఫ్‌ఐఆర్‌లో బాధితులు.. తమకు బాబా పంపిన కొన్ని వాట్సాప్ సందేశాలను కూడా పేర్కొన్నారు. బేబీ.. ఐ లవ్ య్యూ అంటూ మెసేజీలు వచ్చాయని ఆరోపించారు. తమ రూపురేఖలు ఆహార్యంపై కామెంట్స్ చేసేవాడని అన్నారు. ఈ షాకింగ్ విషయాలు విచారణలో బయటపడ్డాయని అధికారులు ధ్రువీకరించారు గతేడాది అక్టోబర్‌లో తొలిసారిగా బాబాపై ఆరోపణలు మొదలయ్యాయి. గత డిసెంబర్‌లో ఓ విద్యార్థినికి ఎముక విరిగితే, ఇందుకు సంబంధించిన ఎక్స్ రే రిపోర్టు కావాలని బాబా బలవంతం చేశాడు. ఆ తరువాత అసభ్యకర మెసేజీలు కూడా పెట్టాడు. ఆ తరువాత ఈ ఏడాది మార్చ్‌లో కొత్త కారుకు పూజ పేరిట తనను పిలిపించాడని, ఆ రాత్రి తనను ఒంటరిగా కలవాలని మెసేజ్ పెట్టాడని ఆ యువతి ఆరోపించింది తాను చెప్పినట్టు చేయకపోతే మార్కులు తగ్గిస్తామని కూడా బాబా బెదిరింపులకు దిగాడని విద్యార్థినులు ఆరోపించారు. హోలీ సందర్భంగా మొదట తనపైనే రంగులు జల్లాలని తమను వేధించాడని అన్నారు. ఇటీవల జూన్‌లో రిషికేశ్ పర్యటన సందర్భంగా ఎప్పుడపడితే అప్పుడు తమను పిలిపించుకుని వేధించేవారని అన్నారు. ఇందుకు అంగీకరించని వారి మార్కులు తగ్గించారని, రాయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.ఇక కాలేజీకి చెందిన శ్వేత, భావన, కాజల్ అనే సిబ్బందిపై కూడా ఓ విద్యార్థిని ఆరోపించింది. పాత మెసేజీలు డిలీట్ చేయాలని వారు తనను బలవంతం చేశారని , క్షమాపణలు చెబుతూ ఈమెయిల్ రాయాలని బలవంతం చేసినట్టు పేర్కొంది. బాబాపై మొత్తం 32 విద్యార్థినులు వాంగ్మూలాలు ఇవ్వగా వారిలో 17 మంది లైంగిక ఆరోపణలు చేశారు.

# హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు ఆరోపణలు



**పాట్నా:** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. కాలేజీ క్యాంపస్‌లో ఆందోళనకు దిగారు. పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టారు. బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని చాంది ఇంజినీరింగ్ కాలేజీలో ఈ సంఘటన జరిగింది. ముంగేర్ జిల్లాలోని బరియార్‌పూర్ బ్లాక్‌కు చెందిన 20 ఏళ్ల సోనమ్ కుమారి సివిల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నది. బుధవారం రాత్రి హాస్టల్ బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న విద్యార్థులు అర్ధరాత్రి వేళ క్యాంపస్‌లో నిరసన చేపట్టారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ నందన్, స్టూడెంట్లను వేధించడంతోపాటు బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. సోనమ్ కుమారి రక్తం మడుగుల్లో అరగంట పడి ఉన్నప్పటికీ కాలేజీ వాహనంలో ఆమెను హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించినట్లు విమర్శించారు. ఆ తర్వాత స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఇది చూసి మృతురాలి స్నేహితురాలు శిఖా కుమారి మానసికంగా కుంగిపోయింది. దీంతో చికిత్స కోసం పాట్నా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు ఆమెను తరలించారమరోవైపు అర్ధరాత్రి వేళ స్టూడెంట్స్ నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. డీఎస్పీ వాహనంతోపాటు ఒక స్కూటర్‌కు నిప్పుపెట్టారు. ప్రిన్సిపాల్‌ను వెంటనే అక్కడకు రప్పించాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ అశాంతి పెరగడంతో ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలతోపాటు 20 పోలీస్ స్టేషన్ల నుంచి పోలీస్ దళాలను ఆ కాలేజీ క్యాంపస్‌లో మోహరించారు. చివరకు గురువారం తెల్లవారుజామున పరిస్థితి అదుపులోకి వచ్చింది.కాగా, విద్యార్థిని సోనమ్ కుమారి మరణంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత ఆమె తల్లిదండ్రులతో పాటు విద్యార్థుల స్టేట్‌మెంట్లు రికార్డ్ చేస్తామని చెప్పా రు. తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# త్వరలోనే ప్రధాని మోదీతో డొనాల్డ్ ట్రంప్ భేటీ



**అమెరికా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో భేటీ కానున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ సీనియర్ అధికారి గురువారం తెలిపారు. మోదీ, ట్రంప్ భేటీపై చర్చలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ద్వైపాక్షిక సంబంధంలో కాస్త గ్యాప్ ఉందని అంగీకరించినప్పటికీ, భారత్, అమెరికా మధ్య సంబంధాలు సానుకూల పథంలో ఉన్నాయని అధికారి వెల్లడించారు. ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య వ్యక్తిగత సంబంధాన్ని చాలా సానుకూలంగా ఉన్నాయని ఆయన అభివర్ణించారుప్రధాని మోదీ, ట్రంప్ కలవడం మీరు చూస్తారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. వారి మధ్య చాలా సానుకూల సంబంధం ఉంది అని అధికారి అన్నాట్లు %హూచీ×% తెలిపింది. ట్రంప్ కొన్ని అంశాలపై బహిరంగంగా నిరాశ వ్యక్తం చేస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి, అయితే విస్తృత భాగస్వామ్యం బలంగా, వ్యూహాత్మకంగా ఉందని అమెరికా ప్రభుత్వం, భారత్‌కు భరోసా ఇవ్వడానికి ప్రయత్నించింది.ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ హై-లెవల్ వీక్ సందర్భంగా సెప్టెంబర్ 22, 2025న న్యూయార్క్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో జరిగిన సమావేశం గురించి మాట్లాడుతూ.. రష్యన్ చమురు సమస్య చర్చించినట్లు అధికారి ధృవీకరించారు. "మా ప్రతి ఒప్పందంలోనూ చర్చించినట్లే రష్యన్ చమురు సమస్య పూర్తిగా చర్చించాం" అని అధికారి అన్నారు. "మా యూరోపియన్ భాగస్వాములతో ఆయనకు స్పష్టత ఉంది. భారతదేశంతో ఆయనకు స్పష్టత ఉంది." ఇటీవలి చర్చల నుండి నిర్దిష్ట నిబద్ధతలు ఏవీ వెల్లడి కానప్పటికీ, పరిపాలన దౌత్యపరమైన మార్పిడులలో ఈ విషయాన్ని లేవనెత్తుతూనే ఉంది.ప్రధాని మోదీ మంచి మిత్రుడు..!

# అభ్యర్థుల ఎంపికపై వారిద్దరిదే తుది నిర్ణయం.



**పుదుచ్చేరి:** తమిళనాడు, పుదుచ్చేరిరాష్ట్రాల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎంపిక చేస్తారని డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతిపేర్కొన్నారు. పుదుచ్చేరి కదిర్‌గామం నియోజకవర్గంలో డీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహం, గ్రంథాలయం, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం గురువారం జరిగింది.ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి డీఎంకే నాయకులు, ఎమ్మెల్యే శివ, తంగవేలు, వడివేల్, తమిళవానన్‌తో కలిసి ఆర్ఎస్ భారతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనమీడియాతో మాట్లాడుతూ, తమిళనాడులో ఏర్పాటు చేసిన కూటమి పుదుచ్చేరికి కూడా వర్తిస్తుందన్నారు. 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో డీఎంకే మెంబర్‌షిప్ డ్రైవ్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించారని, ఇప్పటివరకు 2.70కోట్లమంది సభ్యులుగా చేరినట్లు ఆయన వివరించారు.వచ్చేవారంలో పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పుదుచ్చేరిలోని 30, తమిళనాడులోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి తరుఫున నియోజకవర్గాల విభజన, అభ్యర్థులను కూటమి అగ్రనేతలైన స్టాలిన్, రాహుల్‌గాంధీ ఎంపికచేస్తారన్నారు.

# సోనమ్ వాంగ్‌చుక్‌కు విదేశీ నిధులు




**జమ్మూ:** విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రస్తుతం లడాఖ్‌లో రాష్ట్ర ఏర్పాటు ఉద్యమాన్ని నడిపిస్తున్న విషయం తెలిసిందే. ఆయన 36 రోజులుగా ఆమరణ దీక్ష కొనసాగిస్తున్నారు. బుధవారం లడాఖ్‌లో యువత ఆందోళన చేపట్టి.. భారీ విధ్వంసాన్ని క్రియేట్ చేశారు. లడాఖ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌ను అమలు చేయాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో సీబీఐ.. విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్‌కు చెందిన విద్యాసంస్థపై దర్యాప్తు చేపట్టింది.విదేశీ పెట్టుబడుల చట్టం కింద ఉల్లంఘన జరిగినట్లు సీబీఐ భావిస్తున్నది. హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లడాక్( హెచ్‌ఐఏఎల్)పై రెండు నెలల క్రితమే సీబీఐ దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 6వ తేదీన పాకిస్థాన్‌లో వాంగ్‌చుక్ పర్యటించాడు. దీన్ని కూడా దర్యాప్తు సంస్థ రివ్యూ చేస్తున్నది. ఆగస్టులో లడాఖ్ అడ్మినిస్ట్రేషన్.. హెచ్‌ఐఏఎల్‌కు భూ కేటాయింపును రద్దు చేసింది. దీంతో అక్కడ వివాదం ప్రారంభమైంది.రాష్ట్రహోదా, రాజ్యాంగ విధుల కోసం పోరాటం చేస్తున్న లడాఖీ గ్రూపు లు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. హక్కుల కోసం పోరాడుతున్న కేంద్ర పాలిత ప్రజలపై దాడిగా ఆ గ్రూపులు ఆరోపించాయి. విద్యాసంస్థకు వస్తున్న నిధుల గురించి ఆరాతీయడం వల్లే వాంగ్ చుక్ జనాలను రెచ్చగొట్టినట్లు భావిస్తున్నారు. బుధవారం చోటుచేసుకున్న హింసలో నలుగురు మృతిచెందారు. 80 మంది గాయపడ్డారు. దీంట్లో 40 మంది పోలీసులు కూడా ఉన్నారు.

# కేజ్రీవాల్‌కు పది రోజుల్లో ప్రభుత్వ నివాసం.



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా ప్రభుత్వ నివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేశారు. గురువారం వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరైన ఆయన జస్టిస్ సచిన్ దత్తాకు హామీ ఇచ్చారు. 'ఈరోజు నుంచి పది రోజుల్లోగా ఆయనకు (కేజ్రీవాల్) తగిన వసతి కేటాయిస్తాం. మీరు నా స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయవచ్చు' అని అన్నారు.కాగా, 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సీఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు.మరోవైపు బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్‌లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరుతున్నది. అయితే ఆ నివాసాన్ని ఒక సహాయ మంత్రికి కేటాయించినట్లు కేంద్రం కోర్టుకు తెలిపింది. కాగా, కేజ్రీవాల్‌కు టైప్ 7 లేదా టైప్ 8 బంగ్లాకు అర్హత ఉన్నదని, ఆయన హోదాను టైప్ 5 బంగ్లాకు తగ్గించకూడదని ఆయన తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రా కోర్టులో వాదించారు.

# రానున్న 25 ఏళ్లలో.. 75 శాతం పెరగనున్న క్యాన్సర్ మరణాలు




**న్యూఢిల్లీ:** రాబోయే 25 ఏళ్లలో క్యాన్సర్ మరణాలు 75 శాతం పెరగనున్నట్లు ద లాన్సట్ జర్నల్ తన నివేదికలో పేర్కొన్నది. ఆ మరణాల సంఖ్య 18.6 మిలియన్లుగా ఉండనున్నది. వయసు మీదపడిన జనాభా పెరగడం కూడా ఓ కారణంగా భావిస్తూ రిపోర్టు ఇచ్చారు. కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 61 శాతానికి పెరగనున్నది. 2050 నాటికి కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 30.5 మిలియన్లుగా ఉండనున్నది. 1990 నుంచి క్యాన్సర్ మృతుల సంఖ్య 74 శాతానికి పెరిగినట్లు పరిశోధకులు అంచనా వేశారు.దిగువ, మధ్య తరగతి దేశాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉన్నట్లు గుర్తించారు. 1990 నుంచి 2023 మధ్య ఇండియాలో క్యాన్సర్ రోగుల సంఖ్య 26.4 శాతం పెరిగినట్లు రిపోర్టు తేల్చింది. ప్రపంచంలోనే ఇది అత్యధిక సంఖ్యగా భావిస్తున్నారు. చైనాలో క్యాన్సర్ కేసుల సంఖ్య 18.5 శాతం పడిపోతున్నట్లు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం క్యాన్సర్ మరణాలకు 44 రిస్క్ ఫ్యాక్టర్లు కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.పొగాకు, అనారోగ్యకరమైన ఆహారం, అధిక బ్లడ్ షుగర్ లాంటివి కొన్ని కారణాలని, వీటిని అదుపు చేసుకోవచ్చు అని నివేదికలో తెలిపారు.

చర్య
తెలంగాణ దిన పత్రిక




# కోనాపురం గ్రామంలో స్నేహ సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు

**-స్నేహ సంఘాల పనితీరు, ఊబకాయం అంశంపై నేషనల్ రూరల్ లీఫ్లీ హుడ్ మిషన్ సభ్యుల పరిశోధన.**

**-ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన ఏపిఎం తిలక్**

**-చిరుధాన్యాలు, ఆహార పరిశుభ్రత, పోషక ఆహారాలపై అవగాహన కల్పించిన ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా**







**చెన్నారావుపేట: 25 సెప్టెంబర్**
వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండలం,కోనాపురం గ్రామంలో స్నేహ సంఘాల పనితీరు, ఊబకాయం (ఒబెసిటీ) అంశాలపై ఢిల్లీ నేషనల్ రూరల్ లీఫ్లీ హుడ్ మిషన్ సభ్యుల పరిశోధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే స్నేహ సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ నేరాలపై ఏపిఎం తిలక్, చిరుధాన్యాలు, ఆహార పరిశుభ్రత, పోషక ఆహారాలపై ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఢిల్లీ నేషనల్ రూరల్ లీఫ్లీ హుడ్ మిషన్ సభ్యులు గ్రామాల్లో స్నేహ సంఘాల పనితీరు, ఊబకాయం (ఒబెసిటీ) అంశంపై పలు పరిశోధన పద్ధతుల ద్వారా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజల నుండి నివేదికను స్వీకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు సభ్యులు శివంగి కర్మాకర్, తాసి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెన్నారావుపేట ఏపిఎం తిలక్ కుమార్ మాట్లాడుతూ: స్నేహ సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, తద్వారా కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని, నేటి ఆధునిక ప్రపంచంలో సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువై పోతున్నాయని కావున ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అలాగే బాలిక సంఘాల ప్రాముఖ్యతపై బాలికల తల్లిదండ్రులకు వివరించారు. బాలికల తల్లిదండ్రులు బాల్య వివాహాల చేయకూడదని 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే బాలికలకు వివాహం చేయాలని కోరారు. హ్యూమన్ ట్రాఫికింగ్ నివారణ, బాలికల విద్య ఆరోగ్య ఆర్థిక అభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా మాట్లాడుతూ: మహిళలు ఇంట్లో ఆహార పరిశుభ్రత పాటించాలని, కూరగాయలను పరిశుభ్రంగా కడుక్కొని ఆహారం తయారు చేసుకోవాలని, ఇంట్లో పిల్లలను బయటి ఆహారాలకు దూరంగా ఉంచి ఇంట్లోనే పోషక విలువలు ఉండే ఆహారాలను అందించాలని కోరారు. పోషక ఆహార వార్షికోత్సవాల కార్యక్రమాన్ని కూడా నిర్వహించి పోషక విలువలు ఉండే ఆహారాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సీసీలు కట్టయ్య, మాణిక్యం, సిఏలు, రమేష్, హైమ, అగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, స్నేహ సంఘాల సభ్యులు, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు, గ్రామ పెద్దలు, బాలికలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక వర్షపాతం ఉన్నందున ఓదెల మండల ప్రజలు మరియు మానేరు నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**- పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్,**

**ఓదెల: సెప్టెంబర్ 25**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని మానేరు పరివాహక ప్రాంతంలో ఉధృతంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓదెల మండల ప్రజలు, మానేరు నది పరివాహక గ్రామాలైన గుంపుల గ్రామం శ్రీ రామభద్ర దేవాలయం దర్శనం కోసం వచ్చే భక్తులు, గుంపుల, ఇందుర్తి బాయమ్మపల్లి రూప్ నారాయణపేట, పోత్కపల్లి, మడక, కనగర్తి, కేశవాపూర్, గుండ్లపల్లి, గ్రామాల ప్రజలు రైతులు రైతు కూలీలు పశువుల కాపరులు , చేపలు పట్టేవారు లోతట్టు ప్రాంతాల వారు మానేరునదిని దాటే ప్రయత్నం చేయవద్దని భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, జలాశ యాలు, చెరువులు, కుంటలను చూడడానికి వెళ్లకూడదని అన్నా రు. శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్సఫర్స్ తాకవద్దని, గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గరికి వెళ్లరాదని, వాటర్ ఫాల్స్ లాంటి ప్రాంతాలను సందర్శి ంచవద్దని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయట రావద్దని, వరద ప్రవాహాల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు. మండలంలో ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

# కనీస వసతులు కరువైన గుర్రంపోడు భారత్ పెట్రోల్ బంక్.

**- నిబంధనలను గాలికి వదిలేసిన పెట్రోల్ బంక్ యాజమాన్యం.**

**- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు.**

**- పట్టించుకోని అధికార యంత్రాంగం.**

**గుర్రంపోడు: సెప్టెంబర్ 25 :**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్ లో ఉన్న భారత్ పెట్రోల్ బంక్ లో కనీస వసతులు కరువయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండవలసిన మౌలిక వసతులు పెట్రోలు బంకులో లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. భారత్ పెట్రోల్ బంక్ లో త్రాగునీటి



సదుపాయం లేదు తాగునీటి సదుపాయం కోసం ఏర్పాటుచేసిన చిన్నపాటి ఫ్రిడ్జ్ కూడా పనిచేయడం లేదు. పురుషులకు మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటు చేయవలసి ఉండగా ఒకే గదిలో రెండిటిని చూపిస్తున్నారు అవి కూడా సరిగా లేవు. వాహనదారులకు గాలి మిషన్ ఉన్న అది పనిచేయడం లేదు. మరియు పెట్రోల్ బంక్ లో కచ్చితంగా ఉండవలసిన ఫైర్ సేఫ్టీ కూడా లేకుండా నిబంధనలను గాలికి వదిలేసిన యాజమాన్యం తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి గుర్రంపోడు మండల కేంద్రంలోని భారత్ పెట్రోలు బంకులో కనీస వసతులు ఉండేవిధంగా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

# తెలుగుదేశం నాయకత్వంలో 2లక్షల ఉపాధ్యాయ నియామకాలు

**- ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెడుతున్న అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు**

**- మెగా డీఎస్సీ - 2025 నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర**

**పార్వతీపురం మన్యం జిల్లా సెప్టెంబర్ 25**
పార్వతీపురం: ప్రతి మనిషిని మహర్షిగా తీర్చిదిద్దే అతి విశిష్టమైన మహనీయులు.. ఉపాధ్యాయులని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కొనియాడారు. అటువంటి ఉత్కృష్టమైన వృత్తిలోకి అడుగు పెట్టే విధంగా మెగా డీఎస్సీ – 2025కి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం, రికార్డు వ్యవధిలో పరీక్షలు నిర్వహించి.. ఫలితాల ప్రకటించడంతో పాటు నియామక పత్రాలు కూడా అందజేయడం గొప్ప విషయమన్నారు. తాజా నియామకంలో 15,941 మందికి, ఇప్పటి వరకు 14 మెగా డీఎస్సీ నోటిఫికేషన్లతో దాదాపు 2లక్షల మంది ఉపాధ్యాయులను రాష్ట్రానికి అందించిన ఘనత తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి దక్కుతుందని గుర్తుచేశారు. మెగా డీఎస్సీ – 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ సందర్భంగా వెలగపూడిలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం వేలాది మంది అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల నడుమ అట్టహాసంగా సాగింది. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నూతన ఉపాధ్యాయులను కలుసుకున్న ఆయన.. వారితో కలిసి ఫొటోలు దిగి, శుభాకాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వం తరహాలో మాయమాటలతో నిరుద్యోగులను మోసం చేయకు ండా.. ఇచ్చిన మాటకు కట్టుబడి మెగా డీఎస్సీ నిర్వహిండం, కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వివరించారు.



# జర్నలిస్ట్ రమేష్ గౌడ్ ను సన్మానించిన గౌడ సంఘాల నాయకులు

**నర్సంపేట: 25 సెప్టెంబర్**
వరంగల్ జిల్లా, నర్సంపేట పట్టణంలో తెలంగాణా వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ మెంబెర్ గా ఎన్నికైన అనంతుల రమేష్ గౌడ్ ను పట్టణ గౌడ సంఘం, గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ, గౌడ జర్నలిస్ట్ సోదరులు గురువారం షాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రమేష్ గౌడ్ మాట్లాడుతూ: గీత కార్మికులు, జర్నలిస్ట్ ల సమస్యల సాధన కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘ నూతన అధ్యక్ష కార్యదర్శి కోల వెంకటేశ్వర్లు గౌడ్, మద్దెల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు గాదగోని సాంబయ్య గౌడ్, ఆర్థిక కార్యదర్శులు గిరగాని కిరణ్ గౌడ్, నాతి సదానందం గౌడ్, కమిటీ సభ్యులు తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, వేముల కృష్ణ గౌడ్, నాగెల్లి ప్రమోద్ గౌడ్, మొగలగాని సురేష్ గౌడ్, సుక్క రవి గౌడ్, గిరగాని రమేష్ గౌడ్, సంఘ పెద్ద మనుషులు కొయ్యడి కిరణ్ గౌడ్, నాగెల్లి సారంగం గౌడ్, గాదెగోని సాంబయ్య గౌడ్, తాబేటి లక్ష్మణ్, గౌడ్ ఏకాంతం గౌడ్, మల్లేష్ గౌడ్, కుమారస్వామి గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్, కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకటేశ్వర్లు



గౌడ్, సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి శీలం వీరన్న గౌడ్, ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్ గౌడ్, జునూరు నరేష్ గౌడ్, గంధసిరి సాం బ్రాజ్యం గౌడ్, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రుటిలో తప్పిన విద్యుత్ ప్రమాదం



**గార్ల: సెప్టెంబర్ 25**
గార్ల మండలం పుల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని సూర్య తండాలో షార్ట్ సర్క్యూట్ తో విద్యుత్ ప్రమాదం చోటుచేసుకుంది. భూక్య అశోక్ ఇంటిపై విద్యుత్ తీగలు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి షార్ట్ సర్క్యూట్ తో విద్యుత్ తీగలు తెగి ఇంటి ముందు ఉన్న రేకుల పై పడింది. రేకుల కింద ఆడుకుంటున్న చిన్నపిల్లలు గమనించిన అశోక్ అప్రమత్తమై పిల్లలను సురక్షితంగా కాపాడగలిగాడు. హెల్పర్ ఉపేందర్ కు ఫోన్ చేసి చెప్పగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పిలుచుకున్నారు. ఇంటి పైనుండి వెళ్తున్న వైరు ప్రమాదకరంగా ఉందని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని అశోక్ తెలిపారు. ఇప్పటికైనా పునరావృతం కాకుండావైరుని వేరే వైపు నుండి మళ్ళించాలని కోరుకుంటున్నారు.

# కూసుమంచి రామాలయానికి రూ. 5 లక్షల విరాళం అందజేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**కూసుమంచి : సెప్టెంబర్ 25,** మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రూ.5 లక్షల విరాళం అందజేశారు. గురువారం ఉదయం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులకు ఆయన విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు ఈ విరాళానికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామచంద్రుల దీవెనలు ఎల్లప్పుడూ మంత్రి శ్రీనివాస రెడ్డి పై ఉండాలని వారు కోరుకున్నారు.

# రోడ్డు మరమతుల కొరకు వినతి పత్రం



**జోగులాంబ గద్వాల. అల్లంపూర్ సెప్టెంబర్ 25** అలంపూర్ నియోజకవరం ఇటిక్యాల మండల పరిధిలోని వావిలాల గ్రామం నుండి శనగపల్లె గ్రామం వరకూ సరైన రోడ్లు రవాణా సౌకర్యం లేక వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు పలుమార్లు రోడ్లు సరిగా లేక యాక్సిడెంట్లు అయ్యి చిన్నచిన్న గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. వర్షాకాలం వస్తే రోడ్లు జలమయం అయి రోడ్లు గుంతలుగా ఏర్పడడం వల్ల రాకపోకల తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. కనీసం ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నారని, కావున ఈ రోడ్లను మరమతులకు గ్రావెల్ మంజూరు చేయించగలరనీ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి మరమతులు చేయిస్తానని హామీ ఇచ్చారు.


# కొత్త మద్యం దుకాణాలకు రేపట్నుంచి దరఖాస్తులు..!



**తెలంగాణ సెప్టెంబర్ 25,**
తెలంగాణలో కొత్త మద్యం దుకాణాల (లిక్కర్ షాపులు) కేటాయింపు ప్రక్రియ మరియు షెడ్యూల్‌కు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను రేపటి నుండి స్వీకరించనున్నారు. ఈ కొత్త లైసెన్సులు రెండేళ్ల కాలానికి (డిసెంబర్ 1, 2025 నుండి నవంబర్ 30, 2027 వరకు) చెల్లుబాటు అవుతాయి. ముఖ్య వివరాలు:కొత్త మద్యం దుకాణం లైసెన్స్ కోసం దరఖాస్తు రుసుమును రూ. 3 లక్షలుగా నిర్ణయించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం గతంలో శిక్ష పడిన వ్యక్తులు ఎవరైనా ఈ మద్యం దుకాణాలను పొందేందుకు అనర్హులుగా ప్రకటించారు. ఈ కేటాయింపుల ద్వారా తెలంగాణ ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణలో పారదర్శకత, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# చిరుధాన్యాలలో అనేకమైన పోషకాలు

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా**



**చెన్నారావుపేట: 25 సెప్టెంబర్** జిల్లా,చెన్నారావుపేట మండలం,ఉప్పరపల్లి గ్రామంలో పోషక ఆహార వారోత్సవాల సందర్భంగా బతుకమ్మ ఆట పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: ఆకుకూరలు, కాయగూరలు, పాలు, గుడ్లు ఎక్కువ తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ వివరించినారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రూరల్ లీఫ్లీ హుడ్ మిషన్ సభ్యులు, సీసీలు, అంగన్వాడీ టీచర్లు రజిత, విజయలక్ష్మి, సరోజన, ఆయాలు నీలమ్మ, శారద, కట్టమ్మ, సీఏలు మంజుల, శరత్ బాబు, మహిళా సంఘాల ప్రతినిధులు, బాలికలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అజీమ్ కుటుంబాన్ని, గాయపడిన ఆర్టిఐ ఆక్టివిస్ట్ అశ్రఫ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే హరీష్ బాబు.



**సిర్పూర్ టౌన్: సెప్టెంబర్ 25,** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని కాగజ్ నగర్ మండలం టీచర్స్ కాలనీకి చెందిన ఆర్టిఐ ఆక్టివిస్ట్ హెచ్ఆర్డి ట్రైనర్, రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టిఐ అవార్డు గ్రహీత,ప్రభుత్వ ఉపాధ్యాయులు మహా మ్మద్ అష్రఫ్ మొన్న జరి గిన రోడ్డు ప్రమాద దుర్ఘట నలో వారి సోదరుడు ఆర్టిఐ ఆక్టివిస్ట్ డాక్టర్ అజీమ్ ను కోల్పోవడం బాధాకరంమని సిర్పూర్ (టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు.
అదేవిధంగా ఆక్టివిస్ట్ మహమ్మద్ అష్రఫ్ కు తీవ్ర గాయాలై నడవలేని పరిస్థి తిలో ఉండడం దూరదృష్ట కరమని హరీష్ బాబు అన్నారు. గురువారం ఉపాధ్యాయులు మొహమ్మద్, అష్రఫ్ నివాసానికి వెళ్లిన సిర్పూర్(టి)ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అష్రఫ్ సోదరుడు స్వర్గీయ డాక్టర్ అజీమ్ కుటుంబాన్ని ప్రగాఢ సంతాపం ప్రకటిం చారు.అనంతరం మహా మ్మద్ అష్రాఫ్ తో మాట్లా డుతూ..ఆత్మస్థైర్యం కోల్పో కూడదని ధైర్యాన్ని కల్పించారు.

## కొప్పోలులో సీసీ కెమెరాలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.



**గుర్రంపోడు:సెప్టెంబర్ 25,** గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామపంచాయతీలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాలను గురువారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉంటాయని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక,కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్,గుర్రంపోడు ఎస్సై మధు, పంచాయతీ కార్యదర్శి సతీష్,మాజీ సర్పంచ్ తిరుగుడు జ్యోతి లింగారెడ్డి,బొమ్ము శ్రీనివాస్,కొత్త నాగరాజు,తేలుకుంట్ల రవి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయిని దేవిగాదర్శనమిచ్చిన అమ్మవారులి



**మోతే : సెప్టెంబర్ 25,**
మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం రోజు నాలుగో రోజు వేద పండితులు కాత్యాయిని రూపంలో అలంకరించారు.ఈ సందర్భంగా వేలిదండే శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారి దగ్గర కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## భద్రుతండా గ్రామ లంబాడీ జేఏసీ నూతన కమిటీ అధ్యక్షులుగా అంగోత్ రమేష్ నాయక్



**ఖానాపురం మండలం: 25 సెప్టెంబర్** నర్సంపేట నియోజకవర్గం, ఖానాపురం మండలం, భద్రు తండా గ్రామంలోని లంబాడి జేఏసీ నూతన కమిటీ అధ్యక్షులుగా అంగోత్ రమేష్ నాయక్ ఎన్నికయ్యారు. నర్సంపేట లంబాడి జేఏసీ కన్వీనర్ డాక్టర్ జాటోత్ ఉదయ్ సింగ్ నాయక్ ఆదేశాల మేరకు మండల లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్, జాటోత్ సదర్ లాల్, కో కన్వీనర్ తేజవత్ యాకుబ్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల సలహాదారులు జాటోత్ బాలు నాయక్, మండల జాక్ నాయకులు బాధవత్ బాలకిషన్ నాయక్,బిభూక్య వెంకన్న నాయక్,బిమూడు బాల కృష్ణ నాయక్, భద్రు తండా లంబాడి జాక్ నూతన కమిటీ కో 'కన్వీనర్గా వంకుడోత్ కుమార్ నాయక్ , ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్ నాయక్, కార్యదర్శి మూడు బాల కృష్ణ నాయక్, గుగులోతు లక్ష్మణ్ నాయక్, బానోతు ప్రశాంత్ నాయక్, లావుడ్యా చరణ్ నాయక్, తేజవత్ వంశీ నాయక్, మూడు కళ్యాణ్ నాయక్, గౌరవ అధ్యక్షులు తేజవత్ భద్రు నాయక్, సలహా దారులు వంకుడోత్ రాజు నాయక్, కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే సంబరాలు.





**సెప్టెంబర్ 25 :**
బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, మినిస్టర్ క్వార్టర్స్ లో "ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్" తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కేక్ కట్ చేసి ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఫార్మసిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ తేజవాత్, ఉపాధ్యక్షుడు అలీమ్, ఉమెన్స్ విన్ స్టేట్ ఇంచార్జ్ టి.గాయత్రి, స్టేట్ ఇంచార్జ్ నరసింహ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ తిరుమలరావు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్,బాసు, హుస్సేన్, సీనియర్ ఫార్మసిస్ట్ యాదగిరి, వివిధ జిల్లాలా అధ్యక్షులు పాల్గొన్నారు...

# మైనింగ్ మాఫియాను అడ్డుకుంటాం
# ఆదాడ మోహన్ రావు జనసేన నాయకులు

**పార్వతీపురం మన్యం జిల్లా. సెప్టెంబర్ 25**
పార్వతీపురం,: ప్రజలు నాశనం అయిపోయిన పర్వాలేదు కాని ఆస్తులు మాత్రం కూడా పెట్టుకోవాలని అన్నట్లు పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతిపక్షం వ్యవహరిస్తుందని పార్వతీపురం నియోజకవర్గ జనసేన నాయుకులు ఆదాడ మోహన్ రావు ఆరోపించారు. జిల్లా కేంద్రం లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అచ్చం మైనింగ్, బడిదేవర కొండ, ఎలుగుల మెట్ట తదితర కొండలపై మరలా ప్రజాసర్వే చేపట్టాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విదంగా మైనింగ్ మాఫియా రెచ్చిపోతుందని ఆరోపించారు. ఈ మేరకు గత నెల 22వ తారీఖున ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి సమస్యను వివరించడం జరిగిందని తెలిపారు.



అలాగే రాష్ట్ర అటవీశాఖ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగా రావు కలవడం జరిగిందని తెలిపారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం నియోజవర్గంలో జరుగుతున్న మైనింగ్ మాఫియా పై ప్రతిపక్షం నోరు మెదపకపోవడం అన్యాయమని అన్నారు. పార్వతీపురం పట్టణ ప్రజలను పట్టిపీడుస్తున్న డంపింగ్ యార్డ్, మంచి నీటి సమస్య పరిష్కరానికి ప్రజలతో కలిసి పోరాటం చేయడం జరుగుతుందని, దసరా తరువాత త్రిశూల వ్యూహంతో ముందుకు పోవడం జరుగుతుందని, కావున మీడియా మీడియా సహకారం ఉండాలని కోరారు.

## పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

**- కొమరం బీమ్ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**
**- గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చెయాలి.**






**కాగజ్ నగర్:సెప్టెంబర్ 25**
కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని ఈస్ గాం పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ లో భాగంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు,5ం అమలు తీరు రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాల ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ హెచ్ ఓ కళ్యాణ్ ను పలు అంశాల పై ప్రశ్నించి, పెండింగ్లో ఉన్న కేసులపై సమీక్షా చేసి,పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు అవసమైన సూచనలు చేసారు. కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించే విధంగా విధులు నిర్వర్థించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి, విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు.సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేసే వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డయాల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించాలని సూచించారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలని, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు గంజాయి వలన కలుగు అనర్థాలు,మహిళ చట్టాలు, సైబర్ నేరాలు, మొదలగు వాటిపై అవగాహన కల్పించాలన్నారు.మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనను అరికట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు, వ్యాపారస్థులకు సీసీ కెమెరాల ఉపయోగం, నేర నియాత్రణలో సీసీ కెమెరాల ప్రముఖ్యాత గురించి అవగాహన కల్పిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి మరియు నూతన చట్టాలపై అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి వాటి కట్టడి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి నేర నివారణ లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ డీఎస్పీ తో కలిసి మొక్కలు నాటారు. ఎస్పీ వెంట కాగజ్ నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్ , కాగజ్ నగర్ రూరల్ సి.ఐ కుమార స్వామి , ఎస్.ఐ కళ్యాణ్ , సిబ్బంది ఉన్నారు.

# పలు గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించిన మండల అధ్యక్షులు సిద్దన రమేష్

**-పాపయ్యపేట గ్రామ కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఉప్పరి కొమురయ్య...**
**-అమృ తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా బొడా నర్సింహ**

**చెన్నారావుపేట: 25 సెప్టెంబర్**
వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఎన్నికలు మండల అధ్యక్షులు సిద్దన రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పాపయ్యపేట గ్రామ కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఉప్పరి కొమురయ్య, అమృ తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా బొడా నర్సింహ ఎన్నికయ్యారు.సిద్ధాన్న రమేష్ మాట్లాడుతూ: చెన్నారావుపేట మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసే విధంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. పాపయ్యపేట గ్రామ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్గా మండల రవి, ఉపాధ్యక్షులుగా అబ్బదాసు సుధాకర్, బుడిగె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా





ముత్రి వీరస్వామి, సహాయ కార్యదర్శిగా బానోత్ సుమన్, యూత్ ప్రెసిడెంట్గా మేడి సాయి, అమృతండా గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మంగిలాల్, ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య భాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భూక్య మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుగులోథ్ ఈర్యా నాయక్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, మాజీ ఎంపీటీసీ రమ భాయ్ మైబు సింగ్ రాథోడ్, సొసైటీ డైరెక్టర్ మజ్జిక రాంబాబు, వెంకటేశ్వర్లు, కన్నం సందీప్, మేడి సంతోష్, అన్నెబొయిన సునీల్, ధన్సింగ్, వాల్య, వెంకన్న, హరిసింగ్, నర్సింహ, క్రిష్ణ, రమేష్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి

**చౌటుప్పల్ : సెప్టెంబర్ 25 ,**
కార్యక్రమంలో భాగంగా గురువారం చౌటుప్పల్ పురపాలక సంఘం నందు సఫాయిమిత్ర సురక్ష శివర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దుస్తువులు, రెయిన్ కోట్ లు , చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ముందుగా అడ్వాన్స్ దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్క కార్మికుడు కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి , జూనియర్ అసిస్టెంట్ రవీందర్, వార్డ్ ఆఫీసర్లు , సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ , పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, మెప్మా టిఎంసి కవిత, నరసింహ, అంజయ్య , పారిశుద్ధ్య విద్యుత్ వాటర్ సప్లై విభాగం కార్మికులు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పర్సనల్ లోన్ పై హిడెన్ ఛార్జీల బాదుడు ఎక్కువైందా?
### ఈ టిప్స్‌తో తగ్గించుకోండిలా!

వ్యక్తిగత రుణాల కోసం నిత్యం ఎంతోమంది బ్యాంకులు,ఎన్‌బీఎఫ్‌సీలకు దరఖాస్తు చేస్తుంటారు. అయితే ఆ రుణం మంజూరు క్రమంలో విధించే ఛార్జీలను చాలామంది పెద్దగా పట్టించుకోరు. ఆర్థిక అవసరాన్ని తీర్చుకునే తొందరలో అదనపు ఛార్జీల బాదుడును రుణగ్రహీతలు గుర్తించకుండానే వదిలేస్తారు. దీనివల్ల వడ్డీ, వివిధ రకాల ఛార్జీలన్నీ కలిసి రుణభారం అమాంతం పెరిగిపోతుంది. వ్యక్తిగత రుణాలతో పాటు వసూలు చేసే అంతర్గత రుసుముల ( హిడెన్ ఛార్జీలు) గురించి,వాటి బారిన పడకుం డా తప్పించుకునే మార్గాల గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**చేతికి అందే సరికి!**
వైద్య ఖర్చులు, చదువుల ఫీజులు, ప్రయాణ వ్యయం,ఇంటి పునర్నిర్మాణం ఇలా ఏ ఖర్చు వచ్చినా వ్యక్తిగత రుణం కోసం జనం అప్లై చేస్తుంటారు. దరఖాస్తుదారుడు తీసుకునే రుణానికి,చేతికి అందే లోన్ అమౌంటుకు అస్సలు పొంతన ఉండదు. రుణాన్ని నెలవారీగా తిరిగి చెల్లించే క్రమంలో వివిధ రకాల ఛార్జీలు అందులో అదనంగా కలుస్తుంటాయి. దరఖాస్తుదారులు రుణాన్ని త్వరగా మంజూరు చేయించుకోవడంపై పెట్టే శ్రద్ధను,అదనపు ఛార్జీల నుంచి తప్పించుకోవడంపై పెట్టడం లేదు. ఫలితంగా వాటిని మౌనంగా భరించాల్సి వస్తోంది.




**హిడెన్ ఛార్జీలివీ!**
వ్యక్తిగత రుణంపై నిర్ణీత వడ్డీరేటును వసూలు చేస్తారు. ఇది బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీని బట్టి మారిపోతుంటుంది. వడ్డీ మినహా చాలా రకాల ఛార్జీలను లోన్‌పై విధిస్తుంటారు. ఈ జాబితాలో ప్రాసెసింగ్ ఫీజు, ప్రీ పేమెంట్ ఫీజు, లేట్ పేమెంట్ ఛార్జీలు ఉంటాయి.
**ప్రాసెసింగ్ ఫీజు :** రుణ మొత్తంలో కొంత భాగాన్ని ప్రాసెసింగ్ ఫీజుగా వసూలు చేస్తారు. రుణ మంజూరు ప్రక్రియను నిర్వహించినందుకు ఈ ఛార్జీని తీసుకుంటారు.
**ప్రీ పేమెంట్ ఫీజు :** రుణ వ్యవధి పూర్తి కావడానికి ముందే మీరు రుణం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తే ప్రీ పేమెంట్ ఫీజును వసూలు చేస్తారు.
**లేట్ పేమెంట్ ఛార్జీ :** లోన్ పేమెంట్లు సకాలంలో జరగనప్పుడు లేట్ పేమెంట్ ఛార్జీని విధిస్తారు.
**డాక్యుమెంటేషన్ ఛార్జీలు :** రుణ ఒప్పందానికి సంబంధించిన పత్రాలను తయారు చేసినందుకు ఈ ఛార్జీలు వసూలు చేస్తారు.
**బీమా ప్రీమియంలు :** రుణం మంజూరు చేసే క్రమంలో కొన్ని బ్యాంకులు,ఎన్‌బీఎఫ్‌సీలు తప్పకుండా బీమా పాలసీ తీసుకోవాలనే షరతు విధిస్తుంటాయి. ఆ బీమా పాలసీకి సంబంధించిన వన్ టైమ్ ప్రీమియంను మీ రుణ మొత్తం నుంచి తగ్గిస్తారు.
**రుణం రద్దు ఛార్జీలు :** రుణం మంజూరయ్యాక, దాన్ని రద్దు చేయాలని భావించే వారిపై రుణం రద్దు ఛార్జీలు విధిస్తారు.

**హిడెన్ ఛార్జీల నుంచి ఇలా తప్పించుకోండి!**
ప్రాసెసింగ్ ఫీజును కొంతమేర తగ్గించమని బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ అధికారులను కోరండి. లోన్ మొత్తాన్ని గడువు కంటే ముందే తిరిగి చెల్లిస్తే, విధించే ఛార్జీల గురించి ఆరా తీయండి. ఎలాంటి ఛార్జీలు లేకుండా లోన్ ప్రీ పేమెంట్ సదుపాయాన్ని కల్పించమని, ఆ విషయాన్ని రుణ ఒప్పందంలో చేర్చమని కోరండి. రుణంపై విధించే వివిధ ఛార్జీల వివరాలు రుణ ఒప్పందంలో ఉంటాయి. వాటిని మీరు చదవండి. అర్థం కాని వాటి గురించి అడిగి తెలుసుకోండి. అదనపు ఛార్జీలపై సందేహాలన్నీ తీరిన తర్వాతే రుణ ఒప్పందంపై సంతకాలు చేయండి. వ్యక్తిగత రుణం కోసం ఒకే బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీపై ఆధారపడకండి. కనీసం రెండు, మూడు ఆర్థిక సంస్థలను సంప్రదించండి. అన్ని ఛార్జీలూ పోను చేతికి వీలైనంత ఎక్కువ రుణ మొత్తాన్ని అందించే బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీని మాత్రమే ఎంచుకోండి. లోన్‌లు అతిగా తీసుకోవడం మంచిది కాదు. ఆదాయ స్థాయిని మించిన రేంజులో రుణాలు తీసుకోకూడదు.

## మీరు నూనె ఎలా పెడుతున్నారు? రాత్రంతా పెట్టి వదిలేస్తున్నారా?
### ఈ తప్పులు చేస్తున్నారా?


జుట్టు ఆరోగ్యం కోసం మనలో చాలా మంది కొబ్బరి నూనెను పెడుతుంటారు. కురులకు మనం అందించే పోషణ అంటే కొబ్బరి నూనె పెట్టడమే. అయితే, ఇది వెంట్రుకలకు పోషకాలు అందివ్వడమే కాకుండామెరిసేలానూ చేస్తాయని నిపుణులు అంటున్నారు. కానీ,నూనె పెట్టే విషయంలో పొరపాట్లు చేయకూడదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.
ముఖ్యంగా పొడిబారిన కురులకు నూనె దివ్యౌషధంలా పని చేస్తుందని అంటున్నారు. అలాగని జిడ్డు తల ఉన్నవారూ పెడతానంటే కుదరదని సూచిస్తున్నారు. ఇది మాడుమీద చర్మరంధ్రాలు మూసుకుపోయేలా చేసి చుండ్రు, దురద,ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తుందని వివరిస్తున్నారు. కాబట్టి,ఇలాంటి వాళ్లు దూరంగా ఉండాలని లేదా లైట్‌వెయిట్ ఆయిల్‌ని తక్కువ మొత్తంలో అయినా పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. మీది జిడ్డు తల కాకపోయినా అతిగా నూనె పెట్టొద్దని.. అదీ ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. పైగా దాన్ని వదిలించడానికి ఎక్కువ షాంపూ కావాలని.. ఫలితంగా తిరిగి రసాయనాలను కురులకు అందిస్తున్నట్లే అవుతుందని వివరిస్తున్నారు.
నూనె పెట్టడం అంటే తలంతా పూయడమే కాదని మసాజ్ కూడా చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే ప్రక్రియంతా పూర్తయినట్టు అవుతుందని తెలిపారు. ఇలా చేయడం విశ్రాంతిని కలిగించడంతోపాటు రక్తప్రసరణ బాగా జరిగి, కురులు పెరిగేలానూ చేస్తాయని వెల్లడిస్తున్నారు. అలాగని అదే పనిగా చేసినా నష్టమే చేస్తుందని5-10 నిమిషాల్లోపు మసాజ్ చేసుకుంటే సరిపోతుందని వివరిస్తున్నారు.



మనలో చాలా మంది నూనె పెట్టుకుని అలానే వదిలేస్తుంటారు. మీరు ఎంతసేపు ఉంచుకుంటున్నారు? నూనె మందంగా ఉంటుందని.. దీనిని పెట్టేసుకుని షాంపూతో కడుక్కోవడం వల్ల ప్రయోజనం ఉండదని సూచిస్తున్నారు. కనీసం గంటసేపు నూనెను ఉంచుకోవాలని.. అప్పుడే పోషకాలు కురులకు అందుతాయని అంటున్నారు. అలాగని రాత్రంతా వదిలేయడమూ మంచిది కాదని ఇలా ఉంచడం వల్ల దుమ్ము, సూక్ష్మజీవులు చేరే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇంకా చుండ్రు, కురులు రాలడానికీ దారితీయొచ్చని వివరిస్తున్నారు. కాబట్టి నూనెను 2 గంటలకు మించి ఉంచుకోకపోవడమే మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు.
ఇంకా చాలామంది నూనె పెట్టగానే దువ్వుతుంటారు. ఇలా చేయడం ప్రమాదకరమని.. నూనె పెట్టాక వెంట్రుకల మొదళ్లు బలహీనపడతాయని చెబుతున్నారు. ఈ సమయంలో దువ్వడం, చిక్కులు తీయడం వంటివి చేస్తే కురులు రాలడానికి కారణమవుతాయని అంటున్నారు. వీలైతే వేళ్లతో మృదువుగా చిక్కులు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇంకా,జడనీ మరీ బిగుతుగా వేసుకోవద్దని.. వదులుగానే వేసుకోవాలని సలహా ఇస్తున్నారు.
కొబ్బరి నూనె చల్లగా పెట్టకూడదని నిపుణులు అంటున్నారు. చల్లని నూనె మాడులోకి ఇంకదని వేడిచేస్తేనే పోషకాలు కుదుళ్ల వరకూ వెళతాయని వివరిస్తున్నారు. అలాగని నూనెను మంగనీయొద్దని గోరువెచ్చగా చేస్తే చాలని సూచిస్తున్నారు. మీకు చుండ్రు సమస్య ఉంటే నూనెకు పూర్తిగా దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. నూనెకు బదులుగా మాడుకీ, కురులకీ తేమను అందించే హెయిర్ మాస్క్‌లు వేసుకోవడం మంచిదని సలహా ఇస్తున్నారు.

## వండిన కూర ఫ్రిజ్‌లో రెండు రోజులు ఉంచినా
### - పచ్చి మాంసం స్టోర్ చేసినా జరిగేది ఇదే!


కూలింగ్ ఫ్రిజ్ రాకముందు జనాలు దాదాపుగా ఆరోగ్యకరమైన భోజనాన్నే తినేవారు. ఏరోజు కూరలు ఆరోజే తినేవారు. మహా కాదంటే.. రాత్రి వండిన కూర తెల్లారి పొద్దున ఆరగించేవారు. కానీ,రిఫ్రిజిరేటర్ వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. రోజుల తరబడి కూరలు ఫ్రిజ్ లో పెట్టి తినడం అలవాటుగా మారిపోయింది. కానీ, ఇలా చేయడం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.
కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు, మాంసం ఇలా ఏదైనా సరే, తీసుకెళ్లి ఫ్రిజ్‌లో కుక్కేయడం దాదాపుగా అందరికీ అలవాటు. కానీ, దీనివల్ల ఉపయోగం కన్నా నష్టమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. ఎక్కువ రోజులు ఫ్రిజ్?లో ఉంచితే వాటిలోని పోషకాలు తగ్గిపోతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ఇక పాలు, చీజ్ వంటి హై-ప్రొటీన్ పదార్థాలు త్వరగా ఇన్ఫెక్ట్ అయ్యే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. వాటిపై త్వరగా బ్యాక్టీరియా చేరే అవకాశం ఉందని అంటున్నారు. అందువల్ల వాటిని వెంటనే ఉపయోగించాలని సూచిస్తున్నారు.



వండిన అన్నం, ఇంకా పాస్తా, దుంపలు వంటి వాటిని ఫ్రిజ్‌లో పెట్టకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ఒకవేళ అన్నం ఫ్రిజ్‌లో ఉంచితే 24 గంటల్లోపు తినేయాలని యూకేకు చెందిన “నేషనల్ హెల్త్ సర్వీస్” సూచించింది.
ఇక, మిగిలిన కూరల గురించి కీలక సూచనలు చేస్తున్నారు. వీలైనంత వరకు తాజాగా తినేయడమే మంచిదని చెబుతున్నారు. ఒకవేళ మిగిలితే ఆ కూరలను ఫ్రిజ్‌లో పెట్టుకొని మర్నాడు తింటే పరవాలేదని అంటున్నారు. కానీ,మూడు రోజులు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే ఆహారం దెబ్బ తింటుందని, విషతుల్యమవుతుందని హెచ్చరించింది.
సలాడ్స్, మసాలా కూరల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని, ఫుడ్ పాయిజనింగ్‌తో ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
చాలా సార్లు పచ్చి మాంసం ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తుంటారు. ఎక్కువగా ఉన్నప్పుడు కాస్త వండేసి,మిగిలింది దాచి పెడుతుంటారు. ఇంకా చేపలు,రొయ్యలు కూడా ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తుంటారు. వీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చాలా మంది మహిళలు చేసే మరొక పని కూరగాయలు కట్ చేసి ఫ్రిజ్‌లో ఉంచడం! ఉదయాన్నే పని ఈజీ అవుతుందనే ఉద్దేశంతో ముందు రోజే కూరగాయలు కోసుకొని, ఆ ముక్కలను ఫ్రిజ్‌లో ఉంచుతుంటారు. ఇలా చేయడం వల్ల వాటిపై బ్యాక్టీరియా చేరుతుందని చెబుతున్నారు. కూరగాయలు, మాంసం,కప్రీలను ఇలా ఎక్కువ సమయం ఫ్రిజ్ లో ఉంచడం వల్ల లాభం కన్నా,నష్టమే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల సాధ్యమైనంత త్వరగా వాడేయాలని సూచిస్తున్నారు.

## చెప్పులు లేకుండా నడిస్తే ఎన్ని లాభాలో తెలుసా?
### బేర్‌ఫుట్‌తో సూపర్ బెనిఫిట్స్ సొంతం!

ఒకప్పుడు చాలా మంది చెప్పులు లేకుండానే బయట తిరిగేవారు. కానీ ఇప్పుడు పాదరక్షలు వేసుకోకుండా అడుగు బయట్ల పెట్టడం లేదు మనలో చాలా మంది. ఇంకా కొందరు అయితే, ఇంట్లో ఉన్నప్పుడు కూడా చెప్పులు వేసుకునే నడుస్తున్నారు. కానీ చెప్పులు లేకుండా నడవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా? ఇలా పాదరక్షలు లేకుండా నడవటాన్ని గ్రౌండింగ్,ఎర్తింగ్ అని కూడా పిలుస్తుంటారు. దీని వల్ల శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆర్యోగ్యంపైనా సానుకూల ప్రభావం ఉంటుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.
చెప్పులు లేకుండా నడవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. ఫలితంగా కాళ్లు, పాదాల్లో తలెత్తిన వాపు తగ్గడంతో పాటు వెరికోసిస్ వెయిన్స్ లాంటి సమస్యలు రాకుండా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రక్త పోటు సైతం అదుపులో ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంకా శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలోనూ ఈ ప్రక్రియ సాయపడుతుందని వెల్లడిస్తున్నారు. అంతేకాకుండా అధిక రక్తపోటు, ఒత్తిడిని దూరం చేసి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అంటున్నారు.



**హాయిగా నిద్రపోతారు:** చెప్పులు లేకుండా నడవడం వల్ల రాత్రి పూట హాయిగా నిద్రపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నడవడం వల్ల ఒత్తిడికి సంబంధించిన కార్టిసాల్ హార్మోన్ స్థాయుల్ని అదుపు చేస్తుందని అంటున్నారు. ఫలితంగా ఒత్తిడి తగ్గి సుఖంగా నిద్రపోతారని వివరిస్తున్నారు.
**ఇమ్యూనిటి పెరుగుతుంది:** చెప్పులు లేకుండా నడవడం వల్ల నొప్పులు తగ్గుతాయని నిపుణులు అంటున్నారు. భూమి ఉపరితలంలో ఫ్రీ ఎలక్ట్రాన్ల సరఫరా ఉంటుందని.. మనం చెప్పుల్లేకుండా నడిచినప్పుడు ఇవి శరీరంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. తర్వాత శరీరంలో హానికరమైన, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయని వెల్లడిస్తున్నారు. ఫలితంగా ఈ గ్రౌండింగ్ ప్రక్రియ ద్వారా ఇన్‌ఫ్లమేషన్‌ను గణనీయంగా తగ్గించుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల దీర్ఘకాలిక నొప్పులు తగ్గడమే కాకుండా రోగనిరోధక ప్రతిస్పందన సైతం పెరుగుతుందని పేర్కొన్నారు.
**హార్మోన్లు ఆరోగ్యం మెరుగు:** ఉదయాన్నే కాసేపు చెప్పుల్లేకుండా నడవడం వల్ల హార్మోన్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. 2018లో Journal of Environmental and Public Healthలో ప్రచురితమైన The Effects of Grounding on the Human Body:A Systematic Reviewఅనే అధ్యయనంలోనూ ఈ విషయం వెల్లడైంది. ముఖ్యంగా ఈ ప్రక్రియ ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌పై సానుకూల ప్రభావం చూపి జీవ గడియారాన్ని ప్రేరేపిస్తుందని వెల్లడిస్తున్నారు. ఫలితంగాహార్మోన్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులోకి వస్తాయని తెలిపారు. ముఖ్యంగా సూర్యుడి నుంచి వచ్చే విటమిన్ డీ అందుతుందని తెలిపారు. చక్కని శరీరాకృతి: చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలు, కాళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

## అన్నం వండేటప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా?
### చాలా బెనిఫిట్స్ మిస్ అయినట్లే!

మనలో చాలా మంది అన్నం వండడం చాలా సులభమని అనుకుంటారు. కానీ,వండుతున్నప్పుడు ఏ చిన్న పొరపాటు జరిగినా అన్నం తినలేని విధంగా మారిపోతుంది. బియ్యంతో మీరు బిర్యానీ చేసినా,పులావ్ చేసినా, బగారా రైస్ చేసినా చివరకు అన్నం వండినా అది పర్ఫెక్ట్‌గా రావాలంటే కొన్ని చిట్కాలు తప్పక పాటించాల్సిందేనని నిపుణులు అంటున్నారు. ఈ జాగ్రత్తలు పాటించి వండితే అన్నం ఆరోగ్యకరంగా, రుచిగా ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.
**నీటి పరిమాణం:** అన్నం వండే సమయంలో నీటి పరిమాణం చాలా ముఖ్యమైనది. నీళ్లు కొంచెం ఎక్కువైతే అన్నం గుజ్జుగుజ్జుగా తక్కువైతే గింజలు గింజలుగా మారుతుంది. అందుకే నీరు సరిపడా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకు మీరు చేయాల్సిందల్లా ఒక కప్పు బియ్యానికి రెండు కప్పులు లేదా ఒకటిన్నర కప్పుల నీరు పోస్తే అన్నం చక్కగా ఉంటుందని అంటున్నారు.
**నానబెట్టకుండా వండటం:** ఈ మధ్య కాలంలో చాలా మంది బియ్యం నానబెట్టకుండానే అన్నం వండేస్తున్నారు. అయితే, అన్నం రుచిగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే మాత్రం బియ్యం నానడం చాలా ముఖ్యమని చెబుతున్నారు. ముఖ్యంగా బిర్యానీ వంటి మసాలాలతో కలిపి వండుతున్నప్పుడు బియ్యం ఎంత బాగా నానితే అంత చక్కగా ఉంటుందని.. అలాగే అన్నం త్వరగా కూడా ఉడుకుతుందని అంటున్నారు.



**ఉప్పు వేయకుండా వండటం:** మనలో చాలా మంది ఉప్పు వేయకుండానే అన్నం వండేస్తుంటారు. అయితే, ఉప్పు వేసి వండటం వల్ల అన్నం మంచిగా ఉడకడమే కాకుండా రుచిగా కూడా ఉంటుందట.
**ఎక్కువ మంట మీద వండటం:** సమయం లేదనో ఆకలి వేస్తుందనో అన్నాన్ని త్వరగా అయ్యేందుకు హై ఫ్లేంలో పెట్టి వండేస్తుంటారు. అయితే, ఆరోగ్యకరంగా, రుచిగా ఉండాలంటే బియ్యాన్ని ఎక్కువ సేపు ఉడికించాలని చెబుతున్నారు. ఎక్కువ మంట మీద ఉడికించడం వల్ల బియ్యం పోషకాలను కోల్పోయే అవకాశాలు ఉన్నాయని వివరిస్తున్నారు.
**వండిన వెంటనే తినడం:** అన్నం వండిన వెంటనే తినకూడదని నిపుణులు అంటున్నారు. ఇలా తినడం మంచి అలవాటు కాదని చెబుతున్నారు. స్టవ్ ఆఫ్ చేసిన తర్వాత కాసేపు అలా వదిలేస్తే అన్నం మరింత రుచిగా, చక్కటి అవుతుందని తెలిపారు.
**పదే పదే కలపడం:** అన్నం వండుతున్న సమయంలో చాలా మంది మధ్యలో పదే పదే కలుపుతుంటారు. కానీ మెతుకు పగలకుండా అన్నం మంచిగా ఉండాలంటే వండేటప్పుడు ఎక్కువ సార్లు కలపకూడదని సూచిస్తున్నారు. ఇలా తరచూ కలపడం వల్ల మెతుకులు విరిగి అన్నం మెత్తగా మారుతుందని అంటున్నారు.
**శుభ్రంగా కడగడం:** ఇంకా మీరు వండుతున్న బియ్యం ఎలాంటిదైనా, ఎంత ఖరీదైంది అయినా సరే వండేముందు తప్పకుండా కడగాలని సూచిస్తున్నారు. వండే ముందు రెండు లేదా మూడు సార్లు కడగడం వల్ల బియ్యం శుభ్రం అవ్వడమే కాకుండా చక్కగా ఉడుకుతుందని వివరిస్తున్నారు.

## ఈ పాలతో వంటలే కాకుండా అందాన్ని పెంచుకోవచ్చట!
### మీరు ట్రై చేయండిలా!

మనం వంటకాల తయారీలో వాడే కొబ్బరి పాలు సౌందర్య సంరక్షణలో కూడా ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని రోజూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇందులోని విటమిన్ ఎ, సి, క్యాల్షియం, ఐరన్, సహజ ప్రొటీన్స్ లాంటి ఎన్నో పోషకాలు ఉండటం వల్ల వీటిని చర్మ, కురుల సంరక్షణకు ఉపయోగించవచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**చర్మానికీ:** కొబ్బరి పాలలోని ఫ్యాటీ యాసిడ్లు చర్మానికి తేమనందించి నిగనిగలాడేలా చేస్తాయని నిపుణులు అంటున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు,కాపర్ చర్మంపై మృత కణాలను తొలగిస్తాయని వెల్లడిస్తున్నారు. ఇంకా ముడతలు, మచ్చలు తగ్గించి, యవ్వన చర్మాన్ని ఇస్తాయని వివరిస్తున్నారు. మొటిమలు, ఎగ్జిమా, సొరియాసిస్ వంటి చర్మ సమస్యలను తగ్గిస్తాయనిచెబుతున్నారు. అంతేకాకుండా,ఆలివ్ నూనె, కొబ్బరి పాలను 2:1 నిష్పత్తిలో కలిపి మేకప్ రిమూవర్‌గానూ వాడుకోవచ్చని సూచిస్తున్నారు.

**కురులకీ:** పొడిబారిన కురులకు కొబ్బరిపాలు తేమను అందిస్తాయని నిపుణులు అంటున్నారు. ఇందులోని విటమిన్లు, ఖనిజాలు, కెరటిన్ వంటివి కుదుళ్లను దృఢంగా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు దెబ్బతిన్న కురులను బాగుచేస్తాయని వివరిస్తున్నారు. అందుకే, వీటిని షాంపూతో కలిపి సహజ కండిషనర్‌లానూ వాడుకోవచ్చని చెబుతున్నారు.

**బరువు నియంత్రణకూ:** ముఖ్యంగా కొబ్బరిపాలలో మీడియం -చైన్ ట్రైగ్లిజరాయిడ్స్ అనే శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి మెటబాలిజాన్ని మెరుగుపరిచి బరువు అదుపులో ఉండేలా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ఇంకా కొబ్బరి పాలు షుగర్ లెవెల్‌ను నియంత్రిస్తాయని అంటున్నారు. కొవ్వుని కరిగించడమే కాకుండా.. రోగనిరోధకతను పెంచి ఎముకలకు బలాన్నీ ఇస్తాయని తెలిపారు. వీటిలోని శాచ్యురేటెడ్ ఫ్యాట్‌లు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తాయని అంటున్నారు.




**తల్లిపాల ఉత్పత్తికీ:** కొబ్బరిపాలలోని విటమిన్లు, ఖనిజాలు ప్రసవంలో పిండం ఎదుగుదలకు సాయపడతాయని అంటున్నారు. ఇంకా వీటిల్లోని లారిక్ యాసిడ్ తల్లిపాల ఉత్పత్తిని పెంచుతుందని చెబుతున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే కీళ్ల నొప్పులనూ, రక్తహీనతలను తగ్గిస్తాయని వివరిస్తున్నారు. అయితే, క్యాలరీలు ఎక్కువ ఉంటాయి.. కాబట్టి, అవసరమైనంతే వాడుకోవాలని సూచిస్తున్నారు.

**ఇలానూ వాడుకోవచ్చు:** కొబ్బరి పాలను కాఫీ, స్మూతీ, ప్రొటీన్ షేక్, ఓట్‌మీల్, సెరియల్స్ లాంటి వాటిలో కలుపుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బెర్రీలు, బొప్పాయి లాంటి పండ్ల ముక్కలపైన చల్లుకోవచ్చని అంటున్నారు. మలేసియన్ కొబ్బరిపాలలో ఆవు, మేక పాలల్లో కంటే అధికంగా యాంటీ ఆక్సిడెంట్ల ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇంకా వీటిలోని ఫినోలిక్ పదార్థం ఒత్తిడి వల్ల శరీరంలోని ప్రొటీన్,డీఎన్ఏ,లిపిడ్‌లు పాడై పోకుండా కాపాడుతుందని తెలిపారు.
అయితే, బయట కొనే కొబ్బరి పాలపై లేబుల్ చెక్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బీపీఏ ఫ్రీ ఉన్నవీ, కేవలం కొబ్బరి, నీళ్లు మాత్రమే ఉన్నవీ ఎంచుకుంటే మేలని సలహా ఇస్తున్నారు. ఎలాంటి చక్కెరలూ కలపకుండా ఉండే కార్టాన్లను ఎంచుకోవాలని చెబుతున్నారు. తక్కువ కెలో రీలు ఉండాలంటే పలుచగా ఉండే, లైట్ క్యాన్ డ్ కొబ్బరిపాలను ఎంచుకోవచ్చని అంటు న్నారు. ఇంకా ఇవేవీ వద్దనుకుంటే తాజా కొబ్బరి పాలను ఇంట్లోనే తయారుచేసుకుంటే ఇంకా మంచిదని చెబుతున్నారు. కొబ్బరిని మెత్తగా మిక్సీ పట్టి, రెండు కప్పుల పాలకు నాలుగు కప్పుల నీళ్లను కలిపేసి వడకట్టుకుంటే తాజా కొబ్బరిపాలు తయారవుతాయని వివరిస్తున్నారు.

## శివుడిని నిస్వార్థంగా పూజించిన గొల్లవానికి శివుడు ఏం చేశాడు?

శివ భక్తుడిని చూసిన గొల్లవానికి సైతం శివయ్యను పూజించుకోవాలన్న ఆశ కలిగింది. ఆ విషయాన్నే శివ భక్తుడికి చెప్పి అనుమతి కోరాడు. దీనికి మహా భక్తుడు సైతం అంగీకరించాడు. దీనికి కారణం లేకపోలేదు. అతన్ని గమనించిన శివ భక్తునికి ఆ గొల్లవాని మొహంలో అమాయకత్వం తప్ప అసూయ అహంకారం కనిపించలేదు. చదువు లేకున్నా మాటలో సంస్కారం ఉంది. పేదవాడు అయినా కూడా శుభ్రంగా ఉతికిన వస్త్రాలు ధరించాడు. పైగా శివ నామ స్మరణతో పువ్వులు తెస్తాను అంటున్నాడుజ ఇస్తున్నది శివయ్యకే కదా అని చాలా సంతోషంగా అంగీకరించాడు.



శివుడే వరం ఇచ్చినట్టుగా పొంగిపోయిన గొల్లవాడు.. ప్రతి రోజు శివ నామ స్మరణ చేస్తూ పూలను తెచ్చి ఇవ్వడం నిత్యకృత్యంగా చేసుకున్నాడు. పూజ జరిగే సమయంలో కిటికీలో నుంచి చూసి శివ నామ స్మరణ చేస్తూ పొంగిపోయే వాడు. ఆ తరువాత కొంత కాలానికి ఇరువురికి కైవల్య ప్రాప్తి కలిగింది. శివ భక్తుడి కోసం శివ గణాలు వచ్చారు. ఆ గొల్లవాని కోసం శివుడు పూల పల్లకిని పంపించాడు. అది గమనించిన శివభక్తునికి గొల్లవాని కోసం పల్లకి ఎందుకొచ్చిందని అడిగాడు. అతను నిత్యం శివనామ స్మరణ చేస్తూ శివ పూజ కోసం పూలు తెచ్చి భక్తిగా సమర్పించేవాడు. అతను తెచ్చిన పూలు శివుని పాదాల చెంతకు చేరేవి. అందుకే శివయ్య పూల పల్లకి పంపాడని శిగణాలు చెప్పారు. శివ గణాలతో వెళ్లిన శివ భక్తుని కన్నా ముందే పుష్ప పల్లకీలో ఆ గొల్లవాడు శివుని సన్నిధి చేరుకున్నాడు.

చర్చ
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం, సెప్టెంబర్ 26, 2025



# అభిషేక్ సిక్సర్ల రికార్డు..



సూపర్ ఫామ్ లో ఉన్న భారత విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ తన ఖాతాలో మరో అరుదైన రికార్డును వేసుకున్నాడు. బుధవారం దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుతమైన అర్ధ సెంచరీ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ క్రమంలో అసియాకప్ ఒక ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా కొత్త రికార్డును నెలకొల్పాడు. కేవలం 5 మ్యాచ్ ల్లోనే తను ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. 2008 ఎడిషన్ లో తను 14 సిక్సర్లు బాదడం విశేషం. అప్పుడు ఈ టోర్నీ వన్డే ఫార్మాట్ లో జరిగింది. టోర్నీ ఇప్పటివరకు 16 సిక్సర్లు బాదిన అభిషేక్.. బంగ్లాపై మ్యాచ్ లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తన జోరుతో మైదానంలోని ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు. భారీ సిక్సర్లతో తన జోరును కొనసాగిస్తూ, కేవలం 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అభిషేక్.. సెంచరీ సాధిస్తాడని అభిమానులు ఆశించారు. గత మ్యాచ్ లో కూడా 70ం స్కోరు చేసిన అభిషేక్.. ఈసారి కూడా ఫ్యాన్స్ ను నిరాశపరుస్తూ మళ్లీ 70ం స్కోరుపైనే ఔటయ్యాడు. అయితే ఈసారి రనౌట్ రూపంలో తను ఔటవడం అభిమానులను షాక్ కు గురిచేసింది. ఇక సూపర్-4లో శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ తోపాటు ఫైనల్ (అర్హత సాధించడం దాదాపు ఖాయమే) మ్యాచ్ ఉండటంతో తన సిక్సర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని శర్మ అభిమానులు కోరుకుంటున్నారు. ఈనెల 26న లంకతో, ఫైనల్ మ్యాచ్ ఈనెల 28న జరుగుతుంది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ బెర్తు సాధిస్తుందన్న అంచనాతో బరిలోకి దిగిన భారత్.. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసి, భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. నిజానికి ఇన్నింగ్స్ ఆరంభంలో అభిషేక్ చేసిన విధ్వంసంతో ఇండియా భారీ స్కోరు సాధిస్తుందని భావించినా, మిడిలార్డర్ విఫలం కావడంతో అనుకున్నదానికంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా (29 బంతుల్లో 38, 4 ఫోర్లు, ఒక సిక్సర్)తో సమయోచిత బ్యాటింగ్ తో జట్టుకు మంచి స్కోరును అందించే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ శుభమాన్ గిల్ (29) కూడా వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లలో రిషాద్ హుస్సేన్ రెండు వికెట్లతో రాణించాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా దేశీప్లేయర్ గా తను రికార్డులకెక్కాడు.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు





భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ లో అతిగా ప్రవర్తించిన ఆ ఇద్దరు పాక్ క్రికెటర్స్ పై భారత్ క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈవిషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, ఫర్హాన్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వని పక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత గన్‌షాట్ చూపిస్తూ హావభావాలు ప్రదర్శించాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. తన సెలబ్రేషన్స్‌ను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా..బయట ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను అని వ్యాఖ్యానించాడు. హారిస్ రవూఫ్ ఏకంగా జెట్ ఫ్లైట్‌లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ చేష్టలు ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికీ దిగాడు. ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై భారత్ విజయం సాధించింది. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది.

# ఫైనల్‌కు 12వ సారి భారత్ !



ఆసియా కప్ 2025లో, భారతీయ జట్టు చాలా మంచి ప్రదర్శన ఇచ్చి ఫైనల్ కి వెళ్ళింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో, టీమ్ ఇండియా 5 మ్యాచ్‌లు గెలిచి సూపర్-4 రౌండ్‌లో అధిపత్యం చూపి, సెప్టెంబర్ 28న ఫైనల్ ఆడటానికి సిద్ధంగా ఉంది. ఇది ఇండియా ఆసియా కప్‌లో 12వ ఫైనల్. ఈ టోర్నమెంట్‌లో ఇండియా చాలా బాగా ఆడింది. గ్రూప్ స్టేజ్, సూపర్-4 రౌండ్‌లో టీమ్ ప్రతి మ్యాచ్‌లో తన శక్తి చూపించింది. ఫైనల్‌లో ఇండియాకి పాకిస్థాన్‌తో సమరం ఉండవచ్చు. ఇండియా ఆసియా కప్ చరిత్రలో 11సార్లు ఫైనల్ ఆడింది, అందులో 8సార్లు గెలిచింది. 1984, 1988, 1995, 1999, 2010, 2016, 2018, 2023లో భారత ఛాంపియన్‌గా నిలిచింది. ఈసారి ఇండియా కోసం యువ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ అద్భుతంగా ఆడాడు. 5 ఇన్నింగ్స్‌లలో 248 పరుగులు చేశాడు. టోర్నమెంట్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్, రెండు మ్యాచ్‌లలో అర్ధ శతకాలు కొట్టాడు, పాకిస్థాన్‌తో సూపర్-4లో 74 పరుగులు, బంగ్లాదేశ్‌తో 75 పరుగులు చేశాడు. అభిషేక్ దూకుడు బ్యాటింగ్ టీమ్ ఇండియాని ప్రతి మ్యాచ్ లో బలమైన స్థితిలో నిలబెట్టింది. అభిషేక్ రెండు సార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా గెలిచాడు. భారత్ గెలుపులో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ సహకారం కూడా ముఖ్యమైంది. అయన ఈ టోర్నీలో 12 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో, రెండు బంతులకు రెండు వికెట్లు తీసి, ప్రతిపక్ష జట్టుని డిఫెన్స్‌లో పడేశాడు. అయన బౌలింగ్‌లో ఇండియా టీమ్‌కి చాల సార్లు ముఖ్యమైన విజయాలు అందిచింది. భారత్ ఇప్పుడు సెప్టెంబర్ 26న సూపర్-4లో ఆఖరి మ్యాచ్ శ్రీలంకతో ఆడుతుంది. ఇప్పటికే శ్రీలంక ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. కానీ ఈ మ్యాచ్ ఇండియాకి ఫైనల్ ముందు సన్నాహకంగా ఉపయోగపడనుంది. ఈ పెర్ఫార్మెన్స్‌తో ఇండియా ఫైనల్‌లో టైటిల్‌ని కాపాడుకోడానికి సిద్ధంగా ఉంది. సెప్టెంబరు 28న ఫైనల్‌లో పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్‌తో ఏదో ఒక జట్టుతో ఆడనుంది. బంగ్లాదేశ్ దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో తలపడనుంది. ప్రస్తుతానికి, ఆసియా కప్ సూపర్ 4 పట్టికలో పాకిస్తాన్ బంగ్లాదేశ్ కంటే ముందంజలో ఉంది, కానీ రెండు జట్లు 4 పాయింట్లతో ఉన్నాయి. నికర రన్ రేట్ మాత్రం వేరుగా ఉంది. బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్ ఓడిస్తే, ఆసియా కప్ 2025లో భారతదేశం %జం% పాకిస్తాన్ మ్యాచ్‌ను చూసే అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరం దుబాయ్‌లో నాల్గోసారి మ్యాచ్‌ను చూసే అవకాశం ఉంటుంది . గాయం కారణంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చినందున, పాకిస్తాన్ కెప్టెన్ లిట్టన్ దాస్ రంగంలోకి దిగుతాడా అనేది కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ టోర్నమెంట్‌లో భారతదేశం యొక్క ఫామ్ ప్రశంసనీయం. ఐదు విజయాలతో, భారతదేశం అజేయంగా నిలిచింది. బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. పాకిస్తాన్ కూడా ఈ సీజన్‌లో భారతదేశం చేతిలో రెండుసార్లు ఓడిపోయింది. అందువల్ల, పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ ఫైనల్‌కు చేరుకున్నా, భారత జట్టు విజయానికి మంచి అవకాశం ఉందని భావిస్తారు.



# బిగ్ బాష్ లీగ్‌లోకి రవిచంద్రన్ అశ్విన్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ బౌలర్లలో ఒకరైన రవిచంద్రన్ అశ్విన్.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ బిగ్ బాష్ లీగ్ టీ20 టోర్నమెంట్‌లో ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సిడ్నీ థండర్ జట్టు తమ 15వ బీబీఎల్ సీజన్ కోసం అశ్విన్‌ను తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీని ద్వారా బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న అత్యంత ప్రసిద్ధ, సీనియర్ భారతీయ ఆటగాడిగా రవిచంద్రన్ అశ్విన్ ఘనత సాధించారు. బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న మొదటి భారతీయ ఆటగాడు అశ్విన్ అని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఆ గౌరవం భారత అండర్-19 జట్టు మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ కు దక్కుతుంది. ఉన్ముక్త్ చంద్ భారత క్రికెట్ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత, 2021-22 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికా కోసం క్రికెట్ ఆడుతున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఐపీఎల్‌తో సహా భారత క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి పదవీ విరమణ చేసిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనడానికి అర్హులు. ఈ విధంగా చూస్తే, భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్‌లో చేరిన రెండో భారతీయ ఆటగాడు, అత్యంత ప్రముఖ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. రవిచంద్రన్ అశ్విన్ గతేడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి, గత నెలలో ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. ఈ రిటైర్మెంట్ నిర్ణయమే అతనికి విదేశీ లీగ్‌లలో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. 38 ఏళ్ల అశ్విన్ తన 221 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌తో సహా ఐదు జట్ల తరఫున ఆడి 187 వికెట్లు తీశారు. అంతర్జాతీయ స్థాయిలో 287 మ్యాచ్‌లలో 765 వికెట్లు పడగొట్టి, టెస్ట్ క్రికెట్‌లో 537 వికెట్లతో ప్రపంచంలో 7వ ప్రముఖ బౌలర్‌గా నిలిచారు. ఈ కొత్త ఒప్పందం గురించి రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "సిడ్నీ థండర్ జట్టు నన్ను ఎలా ఉపయోగించుకోబోతున్నారనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. నన్ను ఆడించే విషయంలో వారికి ధైర్యం కూడా ఉంది. ఆ జట్టు నాయకులతో నేను జరిపిన సంభాషణలు చాలా బాగున్నాయి. డేవిడ్ వార్నర్ ఆడే విధానం నాకు చాలా ఇష్టం, మన కెప్టెన్ కూడా మనలాగే ఆలోచించడం ఎల్లప్పుడూ మంచి విషయం. థండర్ అభిమానుల కోసం నా అత్యుత్తమ ఆటను ప్రదర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. సిడ్నీ థండర్ జనరల్ మేనేజర్ ట్రెంట్ కోప్లాండ్ మాట్లాడుతూ, "అశ్విన్ సిడ్నీ థండర్ జట్టును ఎంచుకోవడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని ఉత్సాహం, విజయం సాధించాలనే కోరిక మమ్మల్ని ఆకర్షించాయి. టోర్నమెంట్ మధ్యలో అతని ప్రపంచ స్థాయి బౌలింగ్ జట్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒక నాయకుడిగా, మార్గదర్శకుడిగా యువ ఆటగాళ్లకు అతని అనుభవం వెలకట్టలేనిది. పశ్చిమ సిడ్నీలో వేగంగా పెరుగుతున్న భారతీయ సమాజంతో అశ్విన్ అనుబంధం మాకు కొత్త అభిమానులను సృష్టిస్తుంది" అని అన్నారు. అశ్విన్ సిడ్నీ థండర్ జట్టులో డేవిడ్ వార్నర్, లాకీ ఫెర్గూసన్, సామ్ బిల్లింగ్స్, పాకిస్తాన్ ఆటగాడు షదాబ్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడనున్నారు. సిడ్నీ థండర్ స్క్వాడ్: వెస్ అగర్, టామ్ ఆండ్రూస్, రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, సామ్ బిల్లింగ్స్ (ఇంగ్లాండ్), ఓలి డేవిస్, లాకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్)

# ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

● కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఎంపిక



ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ జట్టుకు నాయకత్వం వహించనున్నారు. అంతకుముందు, ఆస్ట్రేలియా '%ూా%'తో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే, రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు ఆయన ఆకస్మికంగా కెప్టెన్సీని వదులుకుని జట్టు నుంచి విడుదల కావడం చర్చనీయాంశమైంది. రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీని వదులుకోవడానికి ప్రధాన కారణం వెన్ను నొప్పి. గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న శ్రేయస్ అయ్యర్.. మళ్లీ వెన్నులో కొద్దిగా పట్టేసినట్టు , బిగుసుకుపోయినట్టు అనిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే ఆయన రెడ్ బాల్ క్రికెట్ నుంచి ఆరు నెలలు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన బీసీసీఐకి కూడా తెలియజేశారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ.. ఇప్పుడు వన్డే సిరీస్‌కు సారథిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం. మొదటి వన్డేకు ఇండియా జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్. రెండు, మూడు వన్డేలకు ఇండియా '%ూా%' జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్. ఇరానీ కప్ కోసం 'రెస్ట్ ఆఫ్ ఇండియా' జట్టు: రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్-కెప్టెన్), యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్

## ఫైనల్ ముందు టీమిండియాను వెంటాడుతున్న భయం ఏంటి..?

ఆసియా కప్ 2025లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా గ్రూప్ దశలో అప్రతిహతంగా విజయాలను సాధించింది. సూపర్-4 రౌండ్‌లోనూ బలమైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లను వరుసగా ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు బలంగా కనిపిస్తున్నా.. భారత జట్టును ఓ భయం వెంటాడుతోంది. అదే.. దారుణమైన ఫీల్డింగ్ వైఫల్యం. టీమిండియా వరుసగా 2 సూపర్-4 మ్యాచ్‌లలో చేసిన ఈ పెద్ద పొరపాటే ఫైనల్లో టైటిల్‌ను దూరం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాకిస్తాన్ జట్టుతో జరిగిన కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు చూపించిన ప్రదర్శన ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. జట్టు ఏకంగా 5 క్యాచ్‌లు వదిలేసింది. అంతే కాకుండా ఓ సులవైన రనౌట్ అవకాశాన్ని కూడా కోల్పోయింది. అంటే 6 వికెట్లు తీసే అవకాశాలను వదులుకోవడం ప్రపంచ స్థాయి జట్టుగా పేరున్న భారత్ కు తగని విషయం. ఈ వైఫల్యం జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. పాకిస్థాన్‌పై చేసింది ఒక్క మ్యాచ్ పొరపాటు అనుకుంటే.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఫీల్డింగ్‌లో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఆ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు 5 క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో అత్యంత విచిత్రమైన అంశం ఏమిటంటే, ఈ 5 క్యాచ్‌లలో ఏకంగా నాలుగు క్యాచ్‌లు కేవలం ఒకే బ్యాట్స్‌మెన్ సైఫ్ హసన్ ఇచ్చినవే. "క్యాచెస్ విన్ మ్యాచెస్" (క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి) అనే సూత్రం క్రికెట్‌లో అందరికీ తెలిసిందే. సూపర్-4 మ్యాచ్‌లలో తక్కువ బలమైన జట్లపై ఈ పొరపాట్లు చేసినా విజయం సాధించినప్ప టికీ, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లలో ఇలాంటి చిన్న పొరపాటు కూడా జట్టుకు భారీ నష్టాన్ని, టైటిల్‌ను కోల్పోయే ప్రమాదాన్ని కలిగించవచ్చు. ప్రపంచ స్థాయి జట్టుగా ఉన్న టీమిండియా ఫైనల్‌కు ముందు తమ ఫీల్డింగ్ లోపాలను తక్షణమే సరిదిద్దు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ చేరినా.. కప్పు గెలిచే అవకాశం చేజారే

# పవన్ 'ఓజీ' ఫీవర్...

## ఫ్యాన్స్‌కు పండగేనంటున్న టాలీవుడ్




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' చిత్రం గురువారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. నిన్న రాత్రి నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు పడ్డాయి. విడుదలైన తొలి షో నుంచే ఈ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. కేవలం అభిమానులే కాకుండా, టాలీవుడ్ సినీ ప్రముఖులు కూడా ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో 'ఓజీ' ఫీవర్ ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేస్తోంది.

యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై పలువురు దర్శకులు, నిర్మాతలు, హీరోలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. "స్క్రీన్‌పై అసలైన ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్‌ను చూశాం. పవన్ కల్యాణ్ నటన అద్భుతం. ఇది నిజంగా బ్లాక్‌బస్టర్" అని దర్శకుడు బాబీ ట్వీట్ చేశారు.

నిర్మాత నాగవంశీ స్పందిస్తూ, ""ఓజీ' ఒక ఫైర్‌స్టార్మ్. ఇంట్రో, ఇంటర్వెల్ సీన్లు గూస్‌బంప్స్ తెప్పించాయి. పవన్ స్వాగ్, తమన్ బీజీఎం అదిరిపోయాయి. హంగ్రీ చీతా వేట మొదలైంది" అని పేర్కొన్నారు. మరో నిర్మాత ఎస్‌కేఎన్, ఈ చిత్రం ఫ్యాన్స్‌కు పండగలా ఉందని, దసరా సీజన్‌లో దీపావళిని తెచ్చిందని అన్నారు.

హీరో నాని కూడా, "వేరే వాళ్ల మాటలు వినకండి. 'ఓజీ' బ్లాక్‌బస్టర్ అంతే" అంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. సినిమాకు వస్తున్న స్పందనతో మెగా ఫ్యామిలీలోనూ పండగ వాతావరణం నెలకొంది. మెగా హీరోలు సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్ థియేటర్‌లో సాధారణ ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమా చూస్తూ కాగితాలు విసురుతూ సందడి చేశారు. పవన్ కల్యాణ్ పిల్లలు అకీరా, ఆద్య కూడా తండ్రి సినిమాను చూసి ఎంజాయ్ చేశారు.

సినిమాలో పవన్ ఎంట్రీ, యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగులు ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తమన్ అందించిన నేపథ్య సంగీతం (బీజీఎం) మాస్ ఆడియన్స్‌కు పూనకాలు తెప్పిస్తోందని అంటున్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా సుజీత్ తన విజన్‌ను మరోసారి నిరూపించుకున్నాడని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.


# జయం రవికి మరో షాక్

## ఇంటిని వేలం వేయనున్న బ్యాంకు



తమిళ నటుడు జయం రవి(రవి మోహన్) మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇప్పటికే తన భర్య ఆర్తితో విడాకుల వివాదం కోర్టులో నడుస్తుండగా.. తాజాగా అతడి ఇల్లు వివాదంలో చిక్కుకుంది. చెన్నైలోని ఇంజంబక్కంలో ఉన్న ఆయన ఇంటిని వేలం వేయడానికి బ్యాంకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ ఇంటికి సంబంధించి జయం రవి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ప్రైవేటు బ్యాంక్ అధికారులు ఆయన ఇంటికి వేలం నోటీసులను అంటించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త కోలీవుడ్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. జయం రవి తన ఇంటి కోసం ఒక ప్రైవేటు బ్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకున్నట్లు సమాచారం. ఈ రుణానికి సంబంధించిన నెలవారీ ఈఎంఐలను ఆయన చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి సుమారు రూ.7.60 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినట్లు బ్యాంకు జారీ చేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ రుణం చెల్లించమని బ్యాంక్ యాజమాన్యం గతంలో పలుమార్లు జయం రవికి నోటీసులు పంపించింది. కానీ వాటికి జయం రవి స్పందించకపోవడంతో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద ఈ ఇంటిని వేలం వేసి తమ బకాయిలను వసూలు చేసుకోవడానికి బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది.

# సాహితీ ఇన్ ఫ్రా కేసులో నటుడు జగపతిబాబును విచారించిన ఈడీ




టాలీవుడ్ ప్రముఖ నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరు కావడం చిత్ర పరిశ్రమలో కలకలం రేపింది. భారీ మోసానికి పాల్పడిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్ ఫ్రా కేసులో భాగంగా, అధికారులు ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఎలా ంటి ముందస్తు సమాచారం లేకుండా ఆయన ఈడీ కార్యాలయానికి రావడం చర్చనీయాంశంగా మారింది.దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ విచారణలో, జగపతిబాబు గతంలో సాహితీ ఇన్ ఫ్రా సంస్థ యాడ్స్ లో నటించ అంశంపై ఈడీ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఆ సంస్థ ప్రకటనల్లో నటించినందుకు గాను ఆయనకు అందిన పారితోషికం, చెల్లింపుల మార్గాలపై వివరాలు సేకరించినట్టు సమాచారం. ఆ లావాదేవీల గురించి కూపీ లాగినట్లు తెలుస్తోంది.ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షించిన సాహితీ ఇన్ ఫ్రా, సుమారు 700 మంది నుంచి రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడిందనేది ప్రధాన ఆరోపణ. ఈ నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఇదే కేసులో భాగంగా, మోసం ద్వారా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన రూ.161 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది.గతంలో ఎలాంటి వివాదాల్లోనూ పేరు వినిపించని జగపతిబాబును ఈడీ విచారించడం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ప్రకటనల్లో నటించినందుకే ఆయన్ను సాక్షిగా విచారించారా లేక మరేదైనా కోణం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# హాట్ టాపిక్
# సమంత వాచ్‌ధర



తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో తన నటనతో పాటు స్టైలిష్ ఫ్యాషన్ సెన్సేషన్‌గా నిలిచిన అందాల తార సమంత తాజాగా కొత్త లగ్జరీ వాచ్ ధరించి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఇటీవల సమంత సినిమాల కన్నా కూడా బ్రాండ్లని ప్రమోట్ చేస్తూ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. తాజాగా ఒక లగ్జరీ వాచ్ ను ధరించిన సామ్ అందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేయగా,ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.అయితే సమంత ధరించిన ఆ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించగా, అది ఏ కంపెనీది..? దాని ధర ఎంత ? అంటూ గూగుల్ లో ఆరా తీస్తున్నారు . ఈ క్రమంలో సమంత ధరించిన వాచ్ ట్రాపెజ్డ్ ఆకారంలో ఉండే పియాజెట్ 60 జువెలరీ వాచ్ కాగా , దీని రేటు సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. ఇది తెలుసుకున్న నెటిజన్లు అవాక్కవుతున్నారు. గతంలోనూ సమంత పలు స్టైలిష్ అండ్ లగ్జరీ వాచెస్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె ఎక్కువగా బల్గారీ సర్పెంటీ వాచ్ (రూ. 45 లక్షలకు పైగానే) ధరించి కనిపిస్తుంటుంది. మొత్తానికి సమంత ఈ కొత్త వాచ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "మా ఇంటి బంగారం" సినిమాలో నటిస్తోంది. అంతేకాదు, రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ "రక్త బ్రహ్మాండ్" లోనూ సమంత తన నటనా ప్రతిభను చాటేందుకు కృషి చేస్తుంది. ఇకపోతే సమంత-రాజ్ జంట ప్రేమ వ్యవహారం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబై బాంద్రాలోని ఓ జిమ్ నుంచి కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లిపోవడం వంటివి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని, త్వరలోనే వివాహం చేసుకోవడం ఖాయం అని అంటున్నారు. కొన్నాళ్లుగా వీరి రిలేషన్ గురించి అనేక వార్తలు వస్తున్నా కూడా సమంత కాని, రాజ్ కాని స్పందించింది లేదు.

# ఆలియా భట్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. సెలబ్రిటీలు మాట్లాడే ప్రతి మాటనూ చాలా జాగ్రత్తగా గమనించే ఈ రోజుల్లో, ఆమె తన గత చిత్రాల గురించి చేసిన ఒక చిన్న పొరపాటు నెటిజన్లకు టార్గెట్‌గా మారింది. దీంతో కొందరు ఆమెను విమర్శిస్తుంటే, మరికొందరు అభిమానులు మాత్రం ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

విషయంలోకి వెళ్తే, ఇటీవల ఇటలీలోని మిలాన్‌లో గూచీ స్ప్రింగ్/సమ్మర్ 2026 ఫ్యాషన్ షో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గూచీ గ్లోబల్ అంబాసిడర్‌గా హాజరైన ఆలియా భట్, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన తదుపరి చిత్రం 'ఆల్ఫా' గురించి ప్రస్తావిస్తూ, అది తన కెరీర్‌లోనే మొదటి యాక్షన్ సినిమా అని, ఈ ప్రాజెక్ట్ పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నానని, కాస్త భయంగా కూడా ఉందని తెలిపారు.

ఆలియా చేసిన ఈ వ్యాఖ్యలే ఇప్పుడు వివాదానికి కారణమయ్యాయి. 'ఆల్ఫా' ఆమె మొదటి యాక్షన్ సినిమా ఎలా అవుతుందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆమె నటించిన 'రాజీ', 'జిగ్రా' వంటి చిత్రాల్లో కూడా అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, హాలీవుడ్ చిత్రం 'హార్ట్ ఆఫ్ స్టోన్'లో సైతం ఆమె తన యాక్షన్ ప్రతిభను నిరూపించుకున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇంతటి అనుభవం ఉన్నప్పటికీ, 'ఆల్ఫా'ను తన తొలి యాక్షన్ చిత్రంగా పేర్కొనడం సరికాదని విమర్శిస్తున్నారు.అయితే, ఆలియా అభిమానులు మాత్రం ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు.